# నేటినిజం సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com

website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 5-8-2021





-శ్రీదాస్యం లక్ష్మయ్య
అడ్మిన్, నేటికవిత
9440155240


## నేటికవిత-కవిత్వ విశ్లేషణ

నేటికవితలో ఈ వారం: 'రెక్కలొచ్చిన మనసు'
అనే అంశంపై వచ్చిన 58 కవితల సమీక్షలో అత్యుత్తమంగా నిలిచిన




-దాస్యం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544


### అక్షరసేద్యం

ఇప్పుడొక అక్షరం అరుణ కిరణమై
ఆ పొద్దులో వాలాలి
ఎండుతున్న తరువు గుండెలో
పచ్చదనమై చేరాలె.
ఆశలు చావకముందే ఆరాధనా గీతమై
ఆ చిరుప్రాణుల ముందు
సింగిడిగా నిలవాలె..
తడి ఆరని వసుధ వాకిటిని
కలలోనుండి చేజారనీయక
విశ్వానికి కానుకివ్వాలి..
మండే సూర్యుని బాణాల తాకిడిని
ఆకుపచ్చ తోరణాలతో అడ్డుకోవాలి..
అవును గుండె గుండెను తట్టి
లేపే అక్షర నాగళ్ళను ఎత్తుకోవాలిప్పుడు
కాలుష్యరహిత సమాజ సాగుకు
ఉక్కు సంకల్పమంటి వాక్యాల
ఆయుధాలను సంధించాలిప్పుడు..
ఎద ఎదను తట్టిలేసే తొలిపొద్దు
నులి వెచ్చని భాను కిరణమవ్వాలిప్పుడు
పద అక్షర సేద్యం చేయ కదిలి
వెళదాం.. రెక్కలొచ్చిన మనసుతో..



-శివరంజని వకుళాభరణం
8897668911

వరంగల్ కు చెందిన కవయిత్రి శివరంజని వకుళాభరణం గారు రెక్కలొచ్చిన మనసు అంశంపై అక్షరసేద్యం శీర్షికతో రాసిన కవిత వైవిధ్యభరితంగా ఉంది. అంశం వెలుగులో కవయిత్రి తమదైన శైలిలో భావప్రకటన చేశారు. అభివ్యక్తిలోనవ్యతను పాటించ ప్రయత్నించడం ప్రశంసనీయం. ఎద ఎదను తట్టిలేపే తొలిపొద్దు నులి వెచ్చని భానుని కిరణాలమవ్వాలని సృజనకారులకు పిలుపునిస్తూ కవయిత్రి తమ కవితను తీర్చిదిద్దారు. రెక్కలొచ్చిన మనసుతో అక్షరసేద్యం చేసేందుకు పదండి కదలివెళదామంటూ ఆకాంక్షించిన తీరు అభినందనీయం!

కవిత్వం హృదయాలను కదిలించగలగాలి. ఆలోచింపజేయాలి. చైతన్యానికి దోహద పడాలి. మార్పుకు సహకరించాలంటే.. కవిత్వాన్ని మనసుపెట్టి రాద్దామన్న అభిప్రాయం ధ్వనించేలా కవయిత్రి శివరంజని గారు తమ భావాలను అక్షరాల్లో నిక్షిప్తం చేశారు.

కవులుగా రచయితలుగా సృజనకారులుగా రెక్కలొచ్చిన మనసుతో అక్షర సేద్యం చేసినప్పుడే. అక్షర కిరణం అరుణకిరణమైన పొద్దులో వాలుతుందని పేర్కొన్నారు. ఎండుతున్న తరువుగుండెలో.. పచ్చదనమై అక్షరం సాంత్వననివ్వాలన్న సంకల్పాన్ని కవయిత్రి ఎత్తుగడలో ప్రస్తావించడం బాగుంది. ఆశలు అడియాస కాకముందే.. ఆరాధనాగీతమై చిరుప్రాణుల ముందు అక్షరం హరివిల్లై భాసిల్లాలని కాంక్షించారు. తడి ఆరని వసుధ వాకిటిని కలలో నుండి చేజారనీయక విశ్వానికి కానుకివ్వాలని సూచించారు.

మండే సూర్యుని బాణాల తాకిడిని ఆకుపచ్చ తోరణాలతో అడ్డుకునే విధంగా అక్షరం రూపుదిద్దుకోవాలని కోరారు. గుండె గుండెను తట్టిలేపే అక్షర నాగళ్లను ఎత్తుకోవాలిప్పుడు.. అంటూ కొనసాగించిన తీరు బాగుంది. సమాజ హితాన్ని సంకల్పించి... కాలుష్య రహిత సమాజసాగుకు సృజనకారులు ఇప్పుడు తమ కలాలకు పనిపెట్టాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. మనసుపెట్టి ఉక్కుసంకల్పం వంటి పదబంధాల ప్రయోగంలో ఆయుధాలను సంధించి అక్షర సేద్యం చేద్దామని పిలుపునిచ్చారు. ఎద ఎదను తట్టిలేపే రచనలు చేసేందుకు రెక్కలొచ్చిన మనసుతో కదిలి వెళదాం అంటూ మంచి ముగింపునిచ్చారు. కవులు రచయితల కలాలనుండి ప్రజోపయోగ రచనలు జాలువారాలంటే మనసుపెట్టి రాయాల్సిన అవసరాన్ని కవయిత్రి తెలియజెప్పారు.

### ఊహాలోకం

బాధ్యతల బందీఖానాలో
తలమునకలైన మనసుకు ఇప్పుడిప్పుడే
కొత్తగా రెక్కలు వస్తున్నాయి
విశ్రాంత జీవితంలో
బరువు బాధ్యతలు తీరాక
ఇన్నేళ్లు స్తబ్దంగా నిస్తేజంగా ఉన్న
మనసు అనే పక్షికి రెక్కలు వచ్చినట్లు
ఎగురుతోంది అదిగదిగో గగన వీధుల్లో
ఎండమావుల్లా మిగిలిన ఆశలను
తీర్చుకునే దారులను వెతుకుతూ
అన్వేషిస్తున్నాయి నిలువెల్లా
కాలు కదపకుండా
అప్పుడే రెక్కలొచ్చిన పక్షిలా
ఊహాలోకంలో విహరిస్తూ
బాల్యంలోకి పరుగుతీస్తోంది మనసు
ఆటపాటలు అమ్మ చేతి గోరుముద్దలు
అన్నీ స్మృతిపథంలో తలుస్తూ
గతంలోకి జారిపోయింది రెక్కలల్లారుస్తూ
పట్టపగ్గాలు లేని ఆనందంతో మనసు
కావాలి ఇదే ఇదే శాశ్వతం



-డా.బల్లూరి ఉమాదేవి
9493846984

ఆదోని (కామవరం)కి చెందిన సీనియర్ కవయిత్రి డా. బల్లూరి ఉమాదేవి గారు రెక్కలొచ్చిన మనసు అంశంపై ఊహాలోకం శీర్షికతో తమ కవితను తీర్చి దిద్దారు. మనసు ఊహాలోకాల్లో విహరింపజేస్తూ గతంలో సేదదీరిన క్షణాలను మనోఫలకంపైనర్తించే గత స్మృతులను ఈ కవితలో కవయిత్రి డా. ఉమాదేవి గారు పాఠకులతో పంచుకున్నారు. వృత్తిపరంగా అధ్యాపకురాలిగా పనిచేసి విశ్రాంత జీవితంలో ఉన్న ఆమె గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. బరువు బాధ్యతలు తీరాక విశ్రాంత జీవనంలో కవయిత్రి తాము పొందుతున్న అనుభూతులను తమ అనుభవాలను అక్షరాలలో బంధించారు. ఇంతకాలం బాధ్యతల బందీఖానాలో తలమునకలైన మనసుకు ఇప్పుడిప్పుడే కొత్తగా రెక్కలొస్తున్నాయని ఎత్తుగడలో ప్రస్తావించిన తీరు ప్రశంసనీయంగా ఉంది. ఇన్నేళ్లు స్తబ్దంగా నిస్తేజంగా ఉన్న మనసు మనసు అనే పక్షికి రెక్కలొచ్చినట్లు ఎగురుతోందని అనడం బాగుంది.

ఏళ్ల తరబడి బరువు బాధ్యతలతో తలమునకలైన మనసు ఇప్పుడిప్పుడే ఎండమావుల్లా మిగిలిన కోరికలను ఆశలను ఆశయాలను తీర్చుకునేందుకు రెక్కలు కట్టుకుని పరుగులు తీయిస్తోందన్న అర్థం వచ్చేలా కవయిత్రి తమ భావాలకు అక్షరాకృతినిచ్చారు. మిగిలివున్న ఆశయాలను నెరవేర్చుకునేందుకు ఇప్పుడు విశ్రాంత జీవనంలో మనసు దారులను వెతుక్కుంటోందని పేర్కొన్నారు. ఈ క్రమంలో రెక్కలొచ్చిన పక్షిలా మనసు ఊహాలోకాల్లోకి లాక్కొని వెళుతున్నదని చిన్నప్పటి జ్ఞాపకాలను బాల్యంలోని ఆటపాటలను అమ్మ చేతి గోరుముద్దలను ఇలా అన్నింటినీ స్మృతి పథంలో కదలాడే విధంగా మనసు పరుగులు తీస్తోందని వివరించారు. పట్టపగ్గాలు లేని ఆనందం పంచేందుకు మనసు ఆరాటపడుతోందన్న అర్థం వచ్చేలా కవయిత్రి ఉమాదేవి గారు తమ కవితను అంశం వెలుగులో తీర్చిదిద్దారు. ఊహలు గుసగుసలాడదడాకికి మనసే ఆలంబనం. ర్కెలొచ్చిన పక్షిలా మనసు కవ్విస్తూ మురిపిస్తూ గత వైభవాన్ని మనోవేదికపై ఓసారి నాట్యం చేయిస్తూ నెరవేరని ఆశయాల సాధనకై పరుగులు తీయిస్తోందని అనడం బాగుంది. వృత్తిరీత్యా కుటుంబరీత్యా బరువు బాధ్యతలు తీరాక ప్రశాంత జీవనానికి ఆహ్వానం పలికేందుకు విశ్రాంత జీవితాన్ని ఆనందమయం చేసుకునేందుకు మనసు ప్రణాళికలు రచిస్తోందన్న భావం స్ఫురించేలా చెప్పడం బాగుంది.

### కోరికలే గుర్రాలై..

రెక్కలొచ్చిన మనసుకు
ఆకాశమే హద్దు
భూమి అంతా సరిహద్దులే
కంటికి ఇంపైనది
చేజిక్కించుకోవడమే తరువాయి
మనసు ఒక ఆశల సౌధం
అంతిమ లక్ష్యం
అనుకున్నది సాధించడమే!.
రెక్కలొచ్చిన మనసు
ఎక్కడెక్కడో విహరిస్తుంది
అనంత ఆశల లోగిల్లలో ఊరేగుతుంది
కాంక్షలు ఊరిస్తుంటే
కాదనలేక పోతుంది
ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తుంది
అనుకున్న లక్ష్యం వైపుగా
అడుగులు వేస్తుంది!
అంతరాత్మలోని
ఆశల పల్లకిలో కోయిలమ్మ
కొత్తపలుకులా ఉబలాటం
మస్తిష్కాన్ని మథించి
కోరికలు కొత్తరూపుదాల్చి
సంతోషం సరిహద్దులు దాటుతుంది
సీతాకోకచిలుక మకరందం కోసం
పరుగులుపెడుతుంది!.
ఉన్నంతలో తృప్తిగా జీవిస్తే అసలైన జీవితం
మనసును కట్టడి చేస్తేనే ఆత్మ పరమానందం
రెక్కలు తొడిగిన గుర్రంలా మనసు పరుగులు
అందని ద్రాక్షపొందాలన్న ఆరాటం
ఆశల మనసుకు ముక్కుతాడు వేయాలి
లేదంటే అప్పుల తిప్పల పోరాటం



-కోణం పర్శరాములు
9959524585

సిద్ధిపేటకు చెందిన కవి కోణం పర్శరాములు గారు రెక్కలొచ్చిన మనసు అంశంపై కోరికలే గుర్రాలైతే శీర్షికతో రాసిన కవితలో ఆశల మనసును నియంత్రించుకోవాలన్న సంగతిని గుర్తుచేశారు. అందని ద్రాక్షను పొందాలన్న ఆరాటం తగదని హితవు పలికారు. రెక్కలొచ్చిన మనసుకు ఆకాశమే హద్దు అనీ.. కంటికి ఇంపైనది కనిపిస్తే చాలు.. చేజిక్కించుకోవాలని మనసు ఉసిగొల్పుతుందని మనసు ఒక ఆశల సౌధం వంటిదని ఎత్తుగడలో పేర్కొన్నారు.

రెక్కలొచ్చిన మనసు ఎక్కడెక్కడో విహరిస్తుందని, మనం అనంత లోగిళ్లలో ఊరేగేలా చేస్తుందని తెలిపారు. కాంక్షలు ఊరిస్తుంటే మనసు కాదనలేకపోవడం సహజమని తెలియజెప్పారు. వివేకంతో ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఉన్నదానిలో సరిపుచ్చుకునేలా వ్యవహరించాలన్న అర్థం స్ఫురించేవిధంగా కవి పర్శరాములుగారు తమకవితను కొనసాగించారు. మనల్ని కవ్వించడమే మనసు పని కనుక విజ్ఞతతో సమస్యల వలలో చిక్కుకోకుండా అడుగులు వేయాలని హితవు పలికారు.

ఆశల పల్లకీలో ఊరేగే విధంగా మనసు ఉబలాటపడడం సహజమనీ.. అయితే మస్తిష్కాన్ని ఉపయోగించి ఆచరణ యోగ్యమైన కోరికలను నిర్ణయించుకోవాలని కోరారు. అప్పుడే చిక్కుల్లో చిక్కుకోకుండాసంతోషాలతీరం చేరతామని పేర్కొన్నారు. మకరందం కోసం పరుగులు తీసే సీతాకోకచిలుకవోలే మనసు ఆరాటపడినా విజ్ఞతతో నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగాలని వివరించారు. ఆచరణ సాధ్యం కాని కోరికలకు అర్రులు చాచకుండా ఉన్నదానిలో తృప్తిగా జీవించడానికి సంసిద్ధులం కావాలని హితవు పలికారు.

మనసుకు కళ్లెం వేసి ఆశలను అదుపు పెట్టుకోవాలని కోరారు. వ్యక్తీకరణలో కవి ఇంకా పరిణతి సాధించవలసిఉంది. కవిత్వ నిర్వహణలో వస్తుస్పష్టత అవసరం.. భావాలను అంశం వెలుగులో ప్రకటించే క్రమంలో సమన్వయం లోపించకుండా కవి పర్శరాములు గారు దృష్టిసారించాలని కోరుకుందాం.. అధ్యయనం ద్వారా కవి కోణం గారు తమ కలానికి మరింత పదును పెట్టుకుంటారని ఆశిద్దాం. ఆ దిశలో ఆయన కవిగా అడుగులు వేయాలని కోరుకుందాం.

### నానీలు

అమ్మ సేవలకు
వెల కట్టలేం
వృద్ధాప్యంలో
వెలివేయకండి చాలు!


ఊరును
కాపాడే తల్లికి
ఊరంతా చేసే పండుగ
బోనాల పండుగ

చెట్టు త్యాగం
ఎంత గొప్పదో!
తాను ఎండలో ఉన్నా
నీడను పంచుతుంది.



-వడ్డేపల్లి సంధ్య
సెల్:7036000123

# సాహిత్యంతోనే సమాజంలో చైతన్యం-బి.వినోద్‌కుమార్



"విశ్వదర్పణ్" పుస్తకావిష్కరణలో అయినంపూడి శ్రీలక్ష్మి, బైస దేవదాసు, రచయిత వడ్డేపల్లి కృష్ణ దంపతులు, బాద్మి శివకుమార్, ఆవిష్కర్త బి. వినోద్‌కుమార్, సినీ నిర్మాత హరీశ్, కాంచనపల్లి ఘోరా, రమాదేవి కులకర్ణి.



వడ్డేపల్లి కృష్ణ దంపతులను సత్కరిస్తున్న బి. వినోద్‌కుమార్, అయినంపూడి శ్రీలక్ష్మి, బైస దేవదాసు, బాద్మి శివకుమార్, రమాదేవి కులకర్ణి.

సాహిత్యం, కవిత్వం రెండూ సమాజ మార్పునకు దోహదపడుతాయని.. తెలంగాణ రాష్ట్రం కూడా సాహిత్యం, పాటలు, పద్యాలతోనే ఏర్పడిందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి. వినోద్‌కుమార్ అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ అక్షర యాన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ జన్మదినం సందర్భంగా విశ్వదర్పణ్ హిందీ పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తెలుగులో ప్రాచుర్యం పొందిన విశ్వదర్పణం ప్రయోగ పద్యాలను హిందీలోకి "దర్పణ్"గా అనువదించడం అభినందనీయమన్నారు. సాహిత్య మూర్తుల విలువ చాలా గొప్పదని, రచయితల ఒక్కొక్క పదప్రభావం ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసి సమాజాన్ని కదిలించి వేస్తుందని, అవి తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిర్లుపోశాయని అన్నారు. తరుచుగా జిల్లాలస్థాయి నుండి ఇలాంటి రచయితల రచనలపై సమాజాన్ని చైతన్యపరిచేందుకు సాహిత్య సదస్సులు, సమావేశాలు తెలంగాణ రాష్ట్రంలో జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు నిర్వాహకులు ముందుకురావాలని ఆయన సూచించారు. ఇలాంటి సాహిత్య సమావేశాలు రవీంద్రభారతిలో నిత్యం జరపాలని కవులు, కళాకారులకు సూచించారు. మొదట సంగీత నాటక అకాడమీ చైర్మన్ బాద్మి శివకుమార్ జ్యోతి వెలిగించి సభను ప్రారంభించి వడ్డేపల్లి కృష్ణ రచనలను అభినందించారు. నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, తంగేడు పక్షపత్రిక పుస్తక సంపాదకులు కాంచనపల్లి ఘోరాలు వడ్డేపల్లి సాహిత్యకృషిని కొనియాడుతు అనువాద రచయిత డా॥మరిగంటి లక్ష్మణాచార్యులను అభినందించారు. అక్షరయాన్ అధ్యక్షురాలు అయినంపూడి శ్రీలక్ష్మి మాట్లాడుతు తన చిన్ననాటి నుండి వడ్డేపల్లి కృష్ణగారి సాహిత్యాన్ని చదువుతున్నానని, ఆయన రాసిన లలిత గీతాలను వింటూ ఆస్వాదిస్తున్నానని అన్నారు. బి.సి.కమీషన్ మాజీ సభ్యులు డా॥వకుళాభరణం కృష్ణమోహన్ , సినీనిర్మాత హరీశ్ పాల్గొన్నారు. రమాదేవి కులకర్ణి వ్యాఖ్యతగా వ్యవహరించారు.

## జయశంకర్ సారు ఆశయాలలో పయనించాలె....



నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షకు ప్రతీక, తెలంగాణ మట్టిగడ్డ తీర్చిదిద్దిన ముద్దుబిడ్డ, సైద్ధాంతిక పునాదిని ఏర్పరిచిన దార్శనికుడుగా పేరుగాంచిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జీవితం తెలంగాణకే స్ఫూర్తి దాయకం. ఆయన జీవించిన కాలమంతా ఒకే ఎజెండాతో బతికిండు. రాష్ట్ర సాధనే లక్ష్యంగా భావించిండు. తెలంగాణ ప్రాంత ప్రజల జీవితాన్ని విధ్వంసం చేస్తున్న ఆంధ్ర వలస పాలనకు వ్యతిరేకంగా ఈ ప్రాంత ప్రజల పక్షాన వకాల్తా తీసుకున్నడు. ఎవరెంత రెచ్చగొట్టినా, మానసికంగా దాడికి దిగినా, సంయమనం కోల్పోకుండా తన వాదనను ఏ మాత్రం తగ్గకుండా, సూటిగా జవాబు చెప్పిన మేధావి మన జయశంకర్ సార్. ఏడున్నర దశాబ్దాల తన జీవితానుభవం, ఆరు దశాబ్దాల ఉద్యమ చైతన్యం నేర్పిన పాఠాలతో ఏలాంటి సమస్య వచ్చినా, దాన్ని తేలికగా పరిష్కరించే ఆలోచన గల మహా మనిషి. తెలంగాణ ఎందుకు కావాలి? అన్న ప్రశ్నకు సరళమైన వ్యావహారిక భాషలో స్పష్టంగా పండితుల తో పాటు పామరులకు కూడా వేలాది సభలలో, సమావేశాలలో కోట్లాది మందికి అర్థమయ్యేటట్లు, పూసగుచ్చినట్లు విడమర్చి చెప్పిండు. ఆయన ప్రతి మాట ఉద్యమానికి ప్రేరణ కలిగించింది.

జయశంకర్ సార్ చూడడానికి సాదాసీదాగా కనిపించే వాడు. కానీ ఆయనది గంభీర స్వరం. అప్పటి ఉద్యమ నేత, ఇప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడేముందు ప్రతి సభలోనూ ముందుగా జయశంకర్ సార్... పుస్తకానికి ముందుమాట వలే ఆ సభలో ఆక్సిజన్ లాంటి మాటలను ముచ్చట రూపంలో అందించాడు. ఆ తర్వాతనే కెసిఆర్ భావోద్వేగాలతో మాట్లాడేవాడు. జయశంకర్ సార్ మాటల ప్రాధాన్యత దీన్నిబట్టి ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. సప్రమాణ మైన చర్చనే తప్ప, ఖచ్చితమైన తర్కమే తప్ప, వితండ వాదం మాట్లాడేవాడు కాదు. ఆయన భావన ఎంత స్పష్టంగా ఉంటదో వ్యక్తీకరణ కూడా అంతే స్పష్టంగా ఉంటది. నాడు ఉర్దూ మీడియంలో చదువుకున్న వాడు కాబట్టి, ఉర్దూను ఒక మతానికి సంబంధించిన భాషగా ఎవరైనా అంటే సహించే వాడు కాదు. అదితెలంగాణ ప్రజల భాష అని తెలియ చెప్పేవాడు. నిజానికి ఉర్దూలో ఆలోచించి, ఆంగ్లంలో అర్థం చేసుకునీ తెలుగు భాషలో మాట్లాడేవాడు. ఒక మతానికి భాష ఉండవచ్చు, కానీ ఒక భాషకు మతం ఉండదు అనేది ఆయన అభిప్రాయం. ముల్కీ నాన్ ముల్కీ ఉద్యమం దగ్గరనుండి తెలంగాణ సిద్ధించే చివరి సంఘటనల వరకు జయశంకర్ సార్ జీవితం ప్రతి అంశానికి దగ్గరగా ముడి వేయబడింది.

జయశంకర్ సార్1952లో అయ్యదేవర కాళేశ్వరరావు" ఆంధ్ర -తెలంగాణ" విలీన ప్రతిపాదన తెచ్చినప్పుడు దాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. దానితో కాళేశ్వర రావు మాట్లాడుతూ... మీరు యువకులు, ఆవేశం తప్ప ఆలోచన ఉండదు. తెలంగాణ ప్రాంతము ఒక రాష్ట్రంగా ఉండజాలదు. మనుగడ సాగించలేదు. అది ఆంధ్రతో కలిస్తేనే తెలంగాణ ప్రయోజనాలు నెరవేరుతాయి అని అన్నప్పుడు దానికి ప్రతిఘటన గా" మేము అడుక్కుతినైనా బతుకుతం కానీ, ఆంధ్రులతో సోపతి చేయం" అని కరాఖండిగా చెప్పిండు. ఓపాలి... 1969 లో తెలంగాణ ఉద్యమం నడుస్తున్నప్పుడు ఆనాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి జయశంకర్ సార్ ను బెదిరిస్తూ.. " నేను తలుచుకుంటే నిన్ను ఇప్పటికిప్పుడే ఉద్యోగం నుండి తీసి వేయగలను " అన్నప్పుడు మన సారు ఏమాత్రము జంకకుండ" నీ బల్ల మీద పేపర్ ఉంది, జేబులో పెన్ను ఉంది. వెంటనే ఆ పని చేయండి" అని సవాల్ విసిరారు". సార్ మాటలు విన్న బ్రహ్మానంద రెడ్డి నోరెల్ల పెట్టిండు. అంటే సారు ఎంత ధైర్యవంతుడో, ఎంతటి ఎదిరించే స్వభావము ఉన్నదో నేటితరం అర్థం చేసుకోవచ్చు. ఎంతో నెనరు గల్ల మనిషి గనుకనే బతుకంతా తెలంగాణ దుఃఖాన్ని, గోసను గుండెల నిండ నింపుకుండు. అదే ఒరవడితో ప్రజలను చైతన్యం చేసిండు. ఎన్నాళ్ళకయినా తెలంగాణ వచ్చి తీరుతుందని, దానికి రాజకీయ ప్రక్రియ ముఖ్యమని గట్టిగా భావించి ప్రజలను కార్యోన్ముఖులు చేశాడు. ఒక్కోక్కసారి తెలంగాణ ప్రాంతంలో వేదికల మీద భిన్న రాజకీయ పార్టీలు భిన్నస్వరాలు వినిపించినప్పుడు జయశంకర్ సారు.. తెలంగాణ ఉద్యమ శక్తులు సమైక్యం గా పని చేయాలె. వీలుకాకుంటే సమన్వయంతో నన్న పని చేయాలె. అది సాధ్యం కాకుంటే సమాంతరంగా పని చేసుకుంటూ పోవాలె. అంతేకానీ వ్యతిరేక దిశలో మనకు మనమే సంఘర్షించ వద్దు అని సారు పదేపదే చెబుతూ ఉండేవాడు. జయశంకర్ సార్ ను మితభాషి అనుకుంటారు. కానీ తనకు ఇష్టమైన వాళ్లతోటి గంటలకొద్దీ మాట్లాడిన సందర్భాలు కోకొల్లలు. మేధావులతో గడిపిన తీరు లెక్క లేనిది. అవసరమున్న చోట అవసరమున్న మేరకే మాట్లాడే సమయస్ఫూర్తి గల వక్త. ఆయనలో గొప్ప హాస్య చతురత కూడా ఉండేది . ఒకసారి సభలో ఉపన్యాసం చెబుతుంటే ఒకాయన లేసి ప్రసంగానికి అడ్డు తగిలి, " తెలంగాణ వస్తే ఏమొస్తుంది సార్? మళ్లీ ఇటువంటి దొంగలే కదా మనల్ని పరిపాలించేది" అన్నప్పుడు... దానికి సమాధానముగా సారు చిరునవ్వుతో.." అవును గీ దొంగలే... ఇటువంటి వాళ్లే పరిపాలిస్తరు. కానీ ఆ దొంగలు తినంగా మిగిలింది ఇప్పటిలాగా ఏ రాజమండ్రి కో, ఏ విజయవాడకో ఇక్కడి సంపద తరలిపోదు కదా! తినంగ మిగిలింది ఈ ప్రాంత అభివృద్ధికే దోహద పడుతుంది కదా". అనగానే సభలో ఉన్న వాళ్లు పెద్దపెట్టున చప్పట్లు కొడుతూ జై తెలంగాణ నినాదాలు చేశారు. ప్రశ్నించిన వ్యక్తి దెబ్బకు తలదించుకుండు. అంటే ఇక్కడ ఆ వ్యక్తిని అవమానపరచడం కాదు కానీ, సరైన విధంగా వివరించి చెప్పడం ముఖ్యమని భావించాలి. ప్రజలకు తమ కష్టాలకు సంబంధించిన అనుభవం ఉంటది కానీ, కష్టాల వెంట ఉన్న వ్యవస్థాగత మూలాలకు సంబంధించిన ఎరుక ఉండదు. ఆ ఎరుకను, సోయి ని తెలియజేయడమే విద్యావంతులు చేయవలసిన ముఖ్యమైన పని అని జయశంకర్ సారు మౌలిక సూత్రాన్ని పదే పదే బోధించాడు.

జయశంకర్ సారు చదివింది అర్థశాస్త్రం అయినప్పటికీ, తెలుగు సాహిత్యంపై పూర్తి అవగాహన కలిగి ఉండేవాడు. ఎన్నో సాహిత్య ఘటనలను, కవిత్వాన్ని, పద్యాలను, కవులను అలవోకగా ఉటంకిస్తూ ఈ విషయాలన్నీ వివరించేవాడు. " తౌరాక్యాంధ్రము " పేరిట తెలంగాణలోని తెలుగును జంధ్యాల పాపయ్య శాస్త్రి లాంటి కవి పండితులు అవమానిస్తే, వారితో వాదనకు దిగి దీటుగా ఓడించినాడు మన జయశంకర్ సార్. తెలంగాణ ప్రాంతాన్ని ఏ ఒక్కరు అవమానించినా, హేళన చేసి మాట్లాడినా సారు ఊరుకునేటోడు కాదు. దీట్టైన జావా బు చెప్పిన ఘటికుడు తెలంగాణ కోసం తన జీవితాన్ని పూర్తిగా అంకితం చేసిన మహనీయుడు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును సారు ప్రత్యక్షంగా చూడలేకపోయిండు. ఆయన రాసిన ప్రతి అక్షరం, చేసిన ప్రసంగాలు, ఇంటర్వ్యూలు సమగ్రంగా ఇప్పుడిప్పుడే అక్షర బద్ధమై ప్రజలకు చేరువవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చినంక ఆయన జీవిత విశేషాలను పాఠ్యపుస్తకాలలో తీసుకురావడం, విశ్వవిద్యాలయానికి ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరు పెట్టడం, ప్రతి యేటా ఆయన జయంతి, వర్ధంతి సభలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించడం గర్వించదగ్గ విషయం. అయినప్పటికీ, ఆయన చిరకాల వాంఛ "బంగారు తెలంగాణ" సాధించడానికి, ఆయన సూచించిన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఆ మార్గంలో పయనించడమే మనందరి ముందున్న ఏకైక లక్ష్యం. ఇదే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి కాగలదు.



- కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి,
సెల్ : 9441561655

భల్లం భాష్యం

## కాలక్షేపం కోసం రాసే కవుల గురించి....

అంతఃకరణల్లో లుప్తమైపోతున్న మమతానుబంధాల జీవధాతువులు గూర్చీ, హరించుకుపోతున్న సమిష్టి చింతనగూర్చీ, హేతుబద్ధంగా, గుణ సౌందరాత్మకంగా తెలియ చెప్పగలిగే కవులు మరీ అపురూపంగా ఉంటారేమో.

ఇవాళ్టి కాలాన ఎవరి కవిత్వ సృజన మీద ఏ విధమైన నిషేధమూ అమలులో అంతగా లేదు గనుక మహోన్నత కల్పన చేయడానికి ఎవరి ముందైనా మరింతక ఎలాంటి ఆటంకము లేదు. ఎవరి కలాలనీ బంధించే ఏ విధమైన సంకెళ్ళూ లేవు. అందువల్ల ఏ తరంలోనూ ఎవరూ విమర్శించ వీలులేని అందరికీ ఒప్పుదల కాగలిగి 'ఆహా' అని తలలూపగలిగే అక్షరాలని ఆవిష్కరించే పనికి కొందరు కవులు ఉపక్రమించడానికి ఉత్సాహ పడుతున్నారు కూడా.

తనకు తాను ఏ విధమైన సెన్సార్ విధించుకోని కవి, "నేను"తో ఉన్న చీకటి కోణాలను నిస్సంకోచంగా నిర్భీతిగా, నిష్కర్షగా, దాపరికం లేకుండా తన కవిత్వంలో ఆవిష్కరించుకుంటాడు. తనకు తెలియకుండా మిగిలిపోయి ప్రశ్నార్థకాలై నిల్చిన వాటిని సహించని స్థితికి చేరుకుంటాడు.

కవిత్వం ఒక పాఠం కాదు. ఒక ఎరుక. అది బంధనం కాదు. ఒక ఎత్తుగడలో ముందుకు సాగడం. అది నినాదప్రాయం కాదు. నిష్పాక్షిక పరిశోధనాత్మకం. అవి అదనంగా కవిత్వానికి బలాన్నిస్తాయి. తాడిత, పీడిత, బడుగు, బలహీన వర్గాల అంతర్లోకం కవిత్వమైనప్పుడు ఉద్యమమూ- కవి ఊహలూ ఒక విధంగా ఒకటే.

కవులెపుడూ రెండు రకాలు అంటారు. అందులో ఒకటోరకం ఎప్పుడో ఏదో ఒకటి రాసే వాళ్ళు. వీరి కవిత్వంలో ఉత్సాహం-ఉద్వేగం పొంగి పొర్లుతుంటాయి. కానీ రెండోరకం- దార్శనికత- అక్షరాల వెంట పరుగులు తీస్తుంటాయి. ఏది రాసినా ఒక కొత్త దనాన్ని దర్శించి- ప్రజ్ఞా, పాటవాలతో జత కలిపి రాస్తుంటారు. దీనికి దృక్పథాన్ని అందించేటటువంటి తత్త్వం ఉంటుంది.

కొందరి కవిత్వం ఎడిట్ చేయకుండానే బావుంటుంది. మరి కొందరి కవిత్వం ఎడిట్ చేసుకుంటేనే ఫ్రెష్‌గా వుంటుంది. ఉదయం పూట చల్లగాలిలా, రాత్రిపూట నిశ్శబ్దంలా, అపుడపుడూ అంతు తెలీనీ విషాదంలా వుంటుంది. ఇటువంటి కవిత్వం ఏకబిగిన చదవడానికి వీల్లేదు. చదవలేరు కూడా. మెల్లి మెల్లిగా చదివి ఒక విషాదానుభూతికిలోనై, ఆ పరిస్థితి నుంచి బయటపడి గానీ, మారు మనసు పొందలేరు.

కవిత్వం కొందరికి రాయాలని ఉంటుంది. మరి కొందరికి చదవాలని ఉంటుంది. కానీ రాయాలనిపించగానే రాత్రికి రాత్రి రాసేయడం, చదవాలనిపించగానే రాత్రికి రాత్రే చదివేసి ఆపోసన పట్టేయాలనుకోవడం ఎంతో అసాధ్యం. కవిత్వం ఎపుడూ కవిత్వంలానే ఉండాలి. కవిత్వం పత్రికల్లో వార్తలా ఉంటే విషయం అవుతుంది. కానీ కవిత్వం మాత్రం కాదు. ప్రాస కలిస్తే కవిత్వమనుకునే రోజులు ఎప్పుడోపోయాయి. కవిత్వం- అక్షరాల పేర్పుడూ, పదాల కూర్పుడూ, వాక్యాల నూర్పుడూ- ప్రాసల పొందికకాదు. మధురభావాల అల్లిక. అద్భుత ప్రతీకల సమాహారిక.

కవిత్వ అధ్యయనం వల్ల- భావ చిత్రాల మధ్య ఒక్కొక్క సందర్భంలో ఒకింత నిశ్శబ్దం- ఐచ్ఛిక మౌనం- అనుభవానికి వస్తుంది. ఈ తరహా నిశ్శబ్దాన్ని బద్దలు చేయడానికి సృజనాత్మక చైతన్యం సాహసించడమూ కనిపిస్తుంది. కవిత్వంలోని గీల్టు స్వర్ణాక్షరాలకు ఒక్కోసారి ప్రతీకలు గీటురాళ్ళులా పనిచేసిన సందర్భాలు ఉంటుంటాయి.

ఏ సమస్యని కవిత్వ వస్తువుగా తీసుకొన్నాదానికి సంబంధించిన సామాజిక ఆర్థిక మానసిక కోణాలను సమన్వయించుకోగలగడం కవిత్వంలో వస్తుపరంగా కనిపించే బలమైన లక్షణంకాని, ఆ లక్షణానికి సరిదీటైన వ్యక్తీకరణ రూపాన్ని కూడా ఎన్నుకుంటే కవిత్వం ఇంకా పదునెక్కుతుంది. దాంతో పాటు, 'తాను రాసిందల్లా కవిత్వమే అనుకుని అది సంపుటాలకెక్కించాలనుకు చిన్న పాటి లౌల్యాన్ని కవి వదలుకోవాలి. లేకపోతే, అది అక విత్వం బారిన పడి అసలు కవిత్వం మరుగునపడే ప్రమాదం ఉంది.

రాజకీయ, సాంఘిక, కళారంగాలలో అడపా దడపా- అవసరమైనప్పుడు ఒకటి రెండో వెనుకటి కవుల కవిత్వపు పంక్తుల్ని కొంతమంది ప్రస్తావిస్తుంటారు. వర్తమాన వ్యవస్థలో ఉపయోగపడని కవిత్వాన్ని కంటితో చూడనైనా చూడడం లేదు. భావ వైచిత్రిలోని ఉదాత్త వైఖరికి నివాళిగా నిలిచే కవిత్వం క్రమ క్రమంగా పాఠకుల హృదయ సీమల్లోంచి పలాయనం చిత్తగిస్తుందే మోనని సాహితీవేత్తలకూ- సాహిత్య అభిమానులకూ బాధగానూ భయంగా ఉంటుంది.

సాహిత్య పేజీల్లో నిరంతం కవిత్వం ఊటలాగ, వెలువడు తూనే ఉంటుంది. వేలాది కవితలు వందలాది సంపుటాలు, పదుల సంఖ్యలో సంకలనాలు వత్సరానికి వెలుగు చూస్తున్నాయి. ఎన్నో సంస్థలు ఏర్పడి మొదలు కవిత్వం ద్వారానే కవి ఆకాంక్షను అక్షర సంపుటాలుగా వ్యక్త పరుస్తున్నాయి. అటువంటి సంకలనాలలో గానీ, సంపుటాలలోగానీ, హృదయాన్ని స్పందింపచేసే కవులు కొందరే ఉంటారు. వారిలో కొందరు మాత్రమే ప్రత్యేక భావ జాలంలో, నూతన అభివ్యక్తితో కవిత్వం రాస్తుంటారు. వాళ్లు మనుషుల్ని జాగృతం చేస్తుంటారు. వారి లక్ష్యం సమసమాజ నిర్మాణంతోపాటు విశ్వకళ్యాణం.

రాత్రికి రాత్రి కవిత్వం రాయడం, రాత్రికి రాత్రి ఆ కవిత్వాన్ని అచ్చువేయడం, రాత్రికి రాత్రే ఆ కవిత్వాన్ని పంపిణీ చేయడం- రాత్రికి రాత్రే ఆ కవిత్వాన్ని ఇతర భాషల్లో అనువదింపచేయడం- అదే రీతిలో- కొందరు కవులు ఆరాటపడిపోతుంటారు. అపరిపక్వమైన అక్షర దోష సహిత కవిత్వాన్ని రాత్రికి రాత్రే పాఠకులు తిరస్కరిస్తారని ఆయా కవుల ఊహకందని విస్పష్ట విషయమేమీ కాదు.

జీవితంలో లాగే కవిత్వ కళారంగాలలో కూడా సమాంతర వాహినులు ఉంటాయి. వాటిని అలాగే గుర్తించి గౌరవించడం అవసరం. కాలక్షేపం కోసం రాసే కవిత్వానికీ, జీవితం గురించీ సామాజిక పరిస్థితుల గురించీ గాఢమైన విచికిత్సతో రచించే కవిత్వానికి తేడా ఉండకుండా ఎలా ఉంటుంది...!!

> జీవితంలో లాగే కవిత్వ కళారంగాలలో కూడా సమాంతర వాహినులు ఉంటాయి. వాటిని అలాగే గుర్తించి గౌరవించడం అవసరం. కాలక్షేపం కోసం రాసే కవిత్వానికీ, జీవితం గురించీ సామాజిక పరిస్థితుల గురించీ గాఢమైన విచికిత్సతో రచించే కవిత్వానికి తేడా ఉండకుండా ఎలా ఉంటుంది...!!



-ఎస్.ఆర్.భల్లం
సెల్: 9885442642

## అమావాస్య చంద్రుడు

ఆమె కలలను దోచేసి కన్నుల్లో కాంతులు కరువయ్యాడంటాడు..
ఆమె ముఖములోని వెన్నెలనంతా మింగేసి ఎప్పుడూ అమావాస్యేనా అంటాడు...
ఆమె మనసుకు ముళ్ళు గుచ్చి గులాబీలా విరియవెందుకంటాడు...
తారకై నాకోసమే పుట్టినట్టుండాలని ఆకాశంలో వెతుకుతాడు ....
నట్టింట్లో నవ్వులు మాయం చేసి నెట్ ఇంట్లో వెతుక్కుంటాడు...
సిగ్గులను దాచుకునే దిండును కన్నీటితో తడుపుకోమంటాడు...
అందిన అమృతాన్ని కాదని అందని హాలాహలానికై వెంపర్లాడుతాడు....
చేతలకు సంకెళ్ళేసి మాటల మూటలు కట్టి మౌనంతో దండయాత్ర చేస్తాడు...
నవ వధువై కోటికాంతులతో అడుగిడిన ఆలిని....
చిమ్మచీకట్లలోకి నెట్టేసి అమావాస్య చంద్రుడై ఒంటరిగా నిశీధినేలుతాడు...
ఏనాటికైనా తన ఆశలు చిగురించి ఆమెకై ఆమనిలా వస్తాడని ...
పున్నమి చంద్రుడై తనకళ్ళల్లో వెన్నెల జల్లులు కురిపిస్తాడని...
తనుకన్న కలలు నిజమై కాంతిపుంజాలను
తనబతుకులో నింపే మగని కోసం మగువ నిరీక్షణ...



**-వకుళవాసు**
9989198334

## వచ్చేది-పోయేది

ఎవ్వరినీ ద్వేషించకు
నీ వెవ్వరినీ యాచించకు..
స్వార్థంతో నీ సహచరులకు
కష్టం, నష్టం కలిగించకు!.

రాగలదెప్పుడు రాకమానదు
పోగలదెప్పుడు పోక నిలువదు..
కాగల కార్యం కాక ఆగదు
కానిపనిని ఆశించుట తగదు.

ఏక్షణమెచట ఏమవుతుందో
ఎవరికిమేలో ఇంకేవరికి కీడు జరుగునో...
ఎవరిని కనికరించునో
ఇంకెవరిని కబళించి వేసునో!.

కాలమన్నదొక మాయ తరంగం
లోకమన్నదొక చీకటి వెలుగుల అంతరంగం..!
ఇది,దేవుని లీలల చదరంగం
పావులమేకదా మనమందరం.!

దక్కనిది నీకెన్నటికీ దక్కదు...
పోయేది నీ దగ్గర ఎన్నటికీ నిలవదు..!
వచ్చేది ఎలాగైనా నీ దరి చేరును.,
పోయేది యేనాటికైనా నీనుండి వెడలును!!



**-ఎన్.. రాజేష్**
9849335757

## శ్రీ శ్రీ .. మొగ్గలు



అక్షరాన్ని అస్త్రంగా వాడుతూ
సమాజాన్ని నవ చైతన్యం తో
మేల్కొల్పినారు
సాహిత్యంలో మైలురాయి .. శ్రీ శ్రీ !

వినూత్న వస్తు శైలితో
పాఠక హృదయాలలో చెరగని
ముద్ర వేసినారు
విప్లవాత్మక భావధార .. శ్రీశ్రీ !

శ్రామికులపై జరిగే దోపిడీకి స్పందిస్తూ
తన కలాన్ని కరవాలం చేసి
సామాజిక సమస్యలపై పోరాడినారు
మడమ తిప్పని ధీశాలి .. శ్రీ శ్రీ !

అగ్గిపుల్ల కుక్కపిల్ల కాదేదీ
కవితకనర్హమంటూ ఎందరిలోనో
కవితావేశాన్ని రగిల్చినారు
యువతకు స్ఫూర్తి ప్రదాత .. శ్రీ శ్రీ !

కారు చీకటిలో పయనించినా
వెన్నెల వెలుగులో ఓలలాడినా
అందరి చేరే దరి ఒక్కటేనన్నారు
సమాజ వాస్తవికత .. శ్రీ శ్రీ !

భావ కవిత్వాన్ని చీల్చుకుని వచ్చి
అభ్యుదయ కవిత్వానికి
గొప్ప పునాది వేసినారు
సామ్యవాద చైతన్యం .. శ్రీ శ్రీ !

పేద ధనిక తేడా లేకుండా
అందరూ చదువుకోవాలని
తన కవిత్వంతో పిలుపునిచ్చారు
కవితా విద్యానిధి .. శ్రీశ్రీ !

బడుగుల బాగు కొరకు అహర్నిశలు
శ్రమిస్తూ తన పాటలతో పలు
జీవితాల్లో వెలుగులు పంచినారు
పేదల పాలిట పెన్నిధి .. శ్రీ శ్రీ !

కులమతాలకు అతీతంగా నిలుస్తూ
యువతలోని శక్తిసామర్థ్యాలను
తన మాటలతో వెలికితీశారు
నవ శకానికి మార్గదర్శి .. శ్రీ శ్రీ

నిరాశ తో బతుకు వెళ్లదీస్తున్న
యువతకు..జీవితాన్ని అర్థవంతంగా
మలుచు కోవాలని బాసటగా నిలిచారు
నిత్య బతుకు జీవనం .. శ్రీశ్రీ !



**-సునీత బండారు**
9440671630

## రైతు

సిరి పంటల కొరకు ,
తల్లి చంటిపిల్లాడిని చూసినట్లు
రైతు పొలాని చూసుకుంటడు.

చంటి పిల్లాడిని తల్లి పొత్తిలలో పెట్టుకొని
మురిపెంగ చూసుకున్నట్లే
రైతు గుండెలో పెట్టుకొని చూసుకుంటడు.

తల్లి చనుబాలు తాగి
పిల్లాడు ఆనందంతో కేరింతలు వేసినట్లే
కొన్ని వర్షపు చినుకులు రాలితే చాలు
రైతు ఆనందంతో ఉబ్బి తబ్బిబవుతడు.

పిల్లలు బుడిబుడి అడుగులు
వేస్తున్నప్పుడు తల్లి ఆనందానికి అవధులు లేన్నట్లే

మట్టి పెల్లలను తన్నుకొని
మొలకలు వస్తున్నప్పుడు రైతు అంతే ఆనందపడ్డడు.

తల్లి పిల్లాడికి కాటుకతో దిష్టి చుక్క పెట్టినట్లే
చేనులో దిష్టి బొమ్మొకటి.

చేను వేపుగా పెరిగితే
పిల్లలు చేతికొచ్చినంత సంబురం.

పంటచేనుకు తెగులు వస్తే
పిల్లాడికి జబ్బుచేసినంత బాధ.

పంట సిరులు ఇంట్లోకి వస్తుంటే
కోడలుపిల్ల ఇంట్లోకొచ్చినంత సంబురం.

**-గుడేలి శీనయ్య**
9959954848

## వేకువ పలకరింపు

సూరయ్య కంటే నువ్వే ముందుండాలని
ఒక వేకువ పలకరింపు కోడి కూతతో.

నిన్న పెట్టుకున్న లక్ష్యాల సాధనకు
ఇది తొలిఅడుగు
కోవెలగీతం శుభం పలికింది.

తూర్పు మేఘాలు సిగ్గుతో ఎర్రబడ్డాయి
బోసినవ్వుల సూరీడు నాతో జతకలిసి
నా కాళ్ళతో కాళ్ళు కలిపి
నాకంటే పొడుగ్గా నల్లగా మారి
ఊసులాడుతూ నాతో జతగా నడుస్తున్నాడు.

దారంటా గువ్వల శుభోదయం పలకరింపులు
సాయంత్రానికి వాడిపోతామని తెలిసినా
నవ్వేపువ్వులు చెప్పే సందేశాలు
చెడును స్వీకరించినా మంచినే పంచమని
చెప్పే హరిత వనాలు.

నాలో నేను మమేకమై ప్రకృతిలో సమైక్యమే
ఏ రోజుకారోజు ఉదయించే సూర్యుడివలె
కొత్త ఆలోచనలతో ఆశయాలతో
శుభోదయ నడకలు.

పక్కన ఎగిరే గువ్వల చెప్పాయి
నీ ఆలోచనలను స్వేచ్ఛగా ఎగురనీయమని
గల గల పారే సెలయేళ్ళు చెప్పాయి
అవకాశాలను అందిపుచ్చుకొని
ఆగకుండా సాగమని.

నా ఉదయపు నడక అష్టారోగ్యాలనే కాదు
ఆత్మీయ స్నేహితులనూ ఇచ్చింది
అనేక సందేశాలనూ ఇచ్చింది.



**-బి. అంజనీదేవి**
9849875082

## తృతీయ తరంగం

మనీతో ముడిపడ్డ జీవితాలలో పెరిగిన దూరాలు
ఉమ్మడిగా రాజుకున్న కుంపట్లు ముక్కలై వేరుపడ్డాయి
పెద్దరికాలు భోగి మంటల్లో పాతబడిపోయిన వస్తువులు
స్వార్థపు నీడల ఆవృతంలో ఏకాకిలా నిలబడ్డ మనిషి
మన్నించలేని ప్రకృతి వికృతమై విషపురుగును వదిలింది
మానవుడు కోరుకున్న ఒంటరితనం శాపంలా మారింది
మనుషుల మధ్య ముఖాలు చూసుకోలేనంత దూరం
మనిషి కూడా పశువేనని మూతికి తగులుకున్న చిక్కాలు
అందం కిట్లు కనుమరుగై ఇల్లంతా నిండిన శానిటైజర్లు
మనిషికి మనిషికి మధ్య ఆమడదూరం
మరణం కమ్ముకున్నా కనిపించని ఆ నలుగురు
ఒంటరితనపు ఆశను ఒంటరిశవంగా మార్చింది కరోన
కడలిలోని తరంగాలలా ఒకదాని తరువాత ఒకటి
మొదటి తరంగం నేనున్నానని తెలిపితే
ద్వితీయ తరంగం విదిలింపు విదిలించింది
ఆర్థికంగా, మానసికంగా కృంగదీసింది
నిన్న పలకరించిన వాడు నేడు చూపులకే అందడం లేదు
కంటిముందు స్వార్థపు యవనిక కరిగిపోయింది
నా అన్న వాళ్ళ కోసం మనసు వెంపర్లాడుతున్నది
మరణించిన దేహం చూసి కన్నీరు తప్ప
తలకొరివి పెట్టలేని దైన్యం
రేపు వచ్చే తృతీయ తరంగం సృష్టించే విలయం ఏ మేరకో
చేసుకున్నవారికి చేసుకున్నంత చందంలా బ్రతుకు జీవనం
ఇల్లే ఇక శ్రీకృష్ణ జన్మస్థానమైన వైనం
ఆత్మరక్షణ చేసుకుంటూ ఆత్మీయతను పెంచుకుందాం
కుక్క తోక వంకర బుద్ధిని విడిచి జ్ఞానం తెలిసి
ఇంటి ముందు చెట్టు, కంటి ముందు మనుషులే
కోట్లకు మించిన పెట్టని కోటలని నమ్ముదాం
ఇకనైనా మంచిని పంచుకునే మనుషులుగా మిగులుదాం



**- శింగరాజు శ్రీనివాసరావు**
9052048706

## చీకటి గీత(నీ)

ఔను...
ఇప్పుడు చీకటి గురించే
చింతించాలి
మాదకద్రవ్యాల మత్తులో
యువత వెలుగుదారి విడిచి
సుదూర చీకట్లవైపు
ఆకర్షితులవడం గురించే
మథన పడాలి...
కొందరి బ్రతుకు నావలు
మహమ్మారి ఘాతంతో
చీకట్లో కలిసిపోవడం
గురించే ఆలోచించాలి
ఆధునిక హంగులతో
అంతరిక్షంలోకి
అడుగుపెట్టిన మనిషికి
ఈ మహమ్మారి
చీకటి గీతాలు
కర్ణకఠోరంగా వినిపించడం...
ప్రపంచానికి ఇప్పుడు కాస్త
చీకటిని మిట్టమధ్యాహ్నమే
పరిచయం చేయడం
మనమంతా చూస్తున్నాం-



**-డా. చిట్యాల రవీందర్**
7798891795

## డాక్టర్‌సాబ్! నీకు సలాం!

రెండు తలల పామైనా
ప్రాణం మాత్రం ఒక్కటే
చీమనుంచి ఏనుగు వరకూ
చివరికి వెంటాడి వేటాడే సింహానికైనా
ప్రాణభయం లేనిదెవరికి?
మానవ మాత్రుడన్నది లోకోక్తేగాని
సృష్టికి ప్రత్యేకాలంకారం మనిషేకదా!
మనిషిలేని ప్రకృతి
అసంపూర్ణ సృష్టిలాంటిదే
చూపులేని కనుగవలాంటిదే
పెంపుడు కుక్కకి గాయమైతే
తల్లడిల్లిపోయే మనిషి
పిట్టల్లా రాలిపోతున్న సాటివాళ్ళని చూసి
నిలువునా నీరైపోడూ?
కంటికి కనిపించని క్రిమి ఒకటి
కాలకూట విషంలా కాటువేసి
నిలువునా నేలకూలుస్తుంటే
నిలువెత్తు మనిషి భయపడిపోడూ!
ముట్టుకుంటే అంటుకొనే రోగానికి వెరచి
అయిన వాళ్ళనీ, ఆప్తులనీ, ఆలినీ
కన్నబిడ్డల్ని సైతం
చివరి చూపుకైనా నోచుకోక
దూరం నుండే సాగనంపాల్సి రావటం
గుండెల్లో గునపాన్ని దించుకోవటమే కదా!
ఎవరికి వారు భయపడి పారిపోతున్నా
కల్లోల సముద్రం ఒడ్డున
కాపలా కాస్తున్న ఒంటరి సైనికుడిలాగ
లైట్‌హౌస్‌లా నిలబడి
కర్తవ్యం నెరిపావు చూడు
చావుని గడ్డిపోచలా భావించి
రాత్రింబవళ్ళు
క్రిమితో యుద్ధం చేశావు చూడు
నా దేశపు జండాలా
ఎగురుతున్నావు చూడు
డాక్టర్ సాబ్!
నీకు సలాం!



**-గుర్రాల రమణయ్య**
9963921943

## అశ్రుధార...!

కరొనపేరుతోడకడుదోపిడాయెను
మమతమర్చిపోయెమనిషినేడు
అంతకంతనరుడునాశలలోబడి
ధరలుబెంచగానుధర్మమౌనె!?

రోగబాధలన్నిరోయకభరియించి
ప్రాణభీతిమించెపరగజూడ
ఆక్సిజన్లపేరనరగదీసిరిసొమ్ము!
శవములిచ్చిపరమషండులిలను!!

కరొనపీడనంబుకలచినలచివేయ
లక్షలాదిడబ్బులక్షణముగ
బీదబిక్కియనకపీడించిదోచిరి
ఉన్నమధ్యవాళ్ళవునికిజూచి!

కడుపులోనిగోసకన్నీటిజాడలు
ఆవిరైయ్యిపోయెనరసిజూడ
ఊపిరాడనిప్రజవునికికోల్పోవగ
గంగలోనద్రోయఘాతుకంబు!

తల్లిపిల్లలంతతపియించిపోయిరి
తండ్రికొడుకులంతదారితప్పి
కరొనవిషపువేటగాటుకిలనుజూడ
కాలిపోయిరిలనుకాటియందు!

ఇంటియింటికొకరినింపుగజంపియు
మనుషులందరికిలమాటువేసి
మానవులకుమధ్యమానవీయత్లేక
ఆటలాడుకరొనయాపదందు!

పాపభీతిలేదుపరగలోకంబున
నీతిహీనులైరి నిజముజూడ
కళ్ళుదెరచినేడుకనుమునిజములన్ని
అదుపుతప్పమనకునశ్రుధారె!



**-డా.గన్నోజుశ్రీనివాసాచారి**
8555899493,

## నువ్వే రాజంటకదనే...!

అన్నా ఓ రైతన్నా...
నువ్వే రాజంటకదనే
తలపాగా చుట్టుకున్నందుకా
కిరీటమల్లే...
లేక మాసిన గుడ్డలు కట్టుకున్నందుకా
హారాలల్లే...
రత్నాల రాశులు పండించి
మూడు దుడ్లకు బేరమాడుతుంటే
ముడుచుకోను జాగలేకుండా
మూలన పోసుకున్నందుకా...
నిత్యం అప్పుల తక్కెడ్లో
జోగుతున్నందుకా..!
కన్నీటిసాల్లు కుమ్మేలుబారినా
కమతాన్ని తడిపి, మేడి పట్టి
వొల్లు పులిసిపోతున్నా వొడుపుగా సాగుచేసి
ఓర్పు సింహాసనం మీద కుర్చున్నందుకా..!.
ఆకలికేకలకు పేగు వెన్నుకట్టుకున్నా...
అన్నమై ఉడకడానికి అహోరాత్రులు శ్రమించి
స్వేదం చిందించి లోకంగొంతులో
తెన్పగా బయటికి వస్తావు...
తెగిన రెక్కలు ముక్కలవుతున్నా
వ్యవ"సాయం" చేసే అన్నదాతవైనందుకా..!
కల్తీ నృత్యం చేస్తుంటే
ఆశల విత్తులు ఒట్టి పోయి,
ఎరువులు కరిగిపోయి
గుండెలు అవిసిపోతుంటే
పురుగుల మందు తాగి,
తల్లి భూగర్భంలో నిద్రపోతున్నందుకా..!



**-శ్రీతరం బింగి శ్రీకాంత్**
7893613015

## మనసులోని మలినాలు??

కడుపులో కత్తులు పెట్టుకొని
మనిషి మాటల
మకరందాన్ని ఒంపుతాడు
మనసులో మలినాలను పెట్టుకొని
పైకి మల్లె పువ్వులా నవ్వుతాడు
ఇతరులపై విషపు జల్లులను కురిపిస్తూ
పైకి ప్రవచనాలను పలుకుతాడు.

పరులపై బలమైన మాటల బండలు వేస్తూ
గుండెలను నిలువునా చీల్చుతాడు
కుట్రలకు దారాలను పేనుతూ
కందుకూరిలా కనిపిస్తాడు.

సమస్యల నిప్పుల కొలిమిని రాజేసి
చక్కగా చలి కాచుకుంటాడు
నూతిలో కప్ప లా మారిపోయి మనిషి
విశాల కడలిని మరిచిపోతాడు
కాలు మోపిన భూమిపైనే భూకంపం సృష్టించి
బంధాల మొదళ్లను తెగ నరుకుతాడు.

ఘనీభవించిన కరుణను కరిగించుకోవాలి
మానవత్వ పరిమళాలు వాడిపోకుండా
అప్పు డప్పుడు నీళ్ళ ను చిలకరించాలి
పరుల కీడును ఎంచే నరుల కన్నా
పరుల మేలు కోరే తరువులే మిన్నా




**-తాటిపాముల రమేష్**
7981566031

పుస్తక సమీక్ష

# మహారాష్ట్ర నివాసాంధ్రుల చరిత్ర ఈ గ్రంథం







ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా విడుదలైన లఘు గ్రంథాల్లో ఒకటి ఈ చిన్ని పుస్తకం– 'మహా' రాష్ట్రలో తెలుగువారు'. అంబల్ల జనార్ధన్ ఈ పుస్తకాన్ని అందించడానికి ఎంత శ్రమపడ్డారో ఆద్యంతం చదివితే మనకు అర్థం అవుతుంది. ఒక విధ:గా ముంబాయ్, పుణా చరిత్రలు చదువుతున్నట్లుగా అనిపించింది. పేజీలు దాటుతూ వుంటేను క్రీ.శ. 1635కు పూర్వమే తెలుగువారు మహారాష్ట్రకు వలస వచ్చారట. క్రీ.శ.1665లో ముంబయి సందర్శించిన డా॥ జాన్ ప్రేయర్ రాసిన 'ట్రావెల్స్ ఇన్ ఈస్టిండియా అండ్‌పర్షియా' అనే గ్రంథంలో 17వ శతాబ్దంలో ముంబయి వచ్చిన తెలుగువారి గురించి వ్రాశారనీ, శివాజీ సైన్యం, హైదరాబాదు నిజాంపై గెలిచినప్పుడు మరికొందరు తెలుగువారు మహారాష్ట్రకు వలసవచ్చారని జనార్ధన్ పేర్కొన్నారు. ఆ రోజుల్లో రవాణా సౌకర్యం లేక దాదాపు 800 కిలో మీటర్లు ప్రయాణించి ముంబయి చేరుకునేవారట. కుటుంబ సభ్యులతో తెలుగులోనే మాట్లాడుకునేవారు వారంతాను. బయటమాత్రం మరాఠీలోనే మాట్లాడేవారట. మాజీ మహారాష్ట్ర ముఖ్యమంత్రి కన్నంవార్, ప్రస్తుత కేంద్రమంత్రి విలాస్‌రావు తెలుగు మూలాలున్న వారేనట. ముంబయి వెళ్ళిన తెలుగువారిలో ఎక్కువగా భవన నిర్మాణ కార్మికులు, బట్టల మిల్లుల్లో పనిచేయడానికి వెళ్ళిన వారూ వున్నారు. ఆ తర్వాత కాంట్రాక్టర్లుగా పైకొచ్చిన కొందరి తెలుగువారి గురించిన ప్రస్తావన వుంది. ఇక ముంబయిలోని తెలుగువారు బీదవారికి చదువు చెప్పించడం, నిరాధారులకు ఆసరా కల్పించడం, దానధర్మ కార్యక్రమాలు చేయడం గురించిన వివరాలు వున్నాయి. సమాజసేవ చేయడంలో తెలుగువారి ప్రత్యేకతను వేరుగా చెప్పాల్సిన అవసరం ఏముంది చుప్పండి? బీదవారైనవారు, చదువుకోవడం కోసం ఒక గ్రంథాలయాన్నే స్థాపించారట. తెలుగేతరులు కూడా ఈ గ్రంథాలయాలను వినియోగించుకుని తమ తమ చదువుల్లో ముందుకుసాగారని వుంది ఈ పుస్తకంలో. ఇంకా మార్కండేయ ఆశ్రమం గురించీ బాలూ డా॥ అంబేద్కర్‌కు తెలుగువారు సహకరించిన సమాచారమూ తెలుగు సమాచార్, తెలుగుమిత్ర పత్రికలు, తెలుగు సమ్మేలనం, రాజకీయ చైతన్యం గురించి తెచ్చిన సమాచారం చాలా ఆసక్తికరంగా అంబల్ల అందించారు మనకు. పొట్టగాల్లు, సద్దులు మోసేవాళ్ళ వివరణలూ, తెలుగువారి ఆలయాల విశేషాలూ తెల్సుకోదగినవిగా వున్నాయి. 80ఏళ్ళ చరిత్ర కలిగిన ముంబయి ఆంధ్రమహాసభ కృషి అభినందనీయం, ఆదర్శప్రాయం. కళారంగంలోనూ మహారాష్ట్ర తెలుగువారు ఏ విషయంలోనూ తీసిపోలేదు. ఇక సాహితీరంగంలో వారు విశేషంగా రాణించారనే చెప్పాలి. అల్లం రాజు రామశాస్త్రి, తురగా జయ శ్యామల, అంబల్ల జనార్ధన్, సుధారమ, ద్యావరిశెట్టి వేంకటేశ్వర్లు, గండూరి, రాపోలు, వడిగొప్పుల, అంబాజీ, బొడ్డు శంకర్, సంగెవేని రవీంద్ర, డా॥కే.వి. నరసింహా రావులుగా ఆదిగా పలువురి గురించిన వివరాలున్నాయి ఇందులో. పలు కవితా సంపుటాలు వెలువడినాయి. రాజకీయ రంగంలో కూడ ముఖ్యంగా పద్మశాలీయులు బాగా రాణించారు.

బివండి వంటి ప్రాంతాల్లో తెలుగు బోర్డులు ఇప్పటికీ కనిపిస్తాయట. అక్కడకువెళ్తే మనం ఆంధ్రప్రదేశ్ వున్నామేమోనన్న భ్రమ కలుగుతుందట. ఇక సోలాపూర్‌కు తెలుగువారు, అప్పట్లోని కరువు కాటకాలను తట్టుకోలేక తెలంగాణా నుండి సోలాపూర్‌కు వలసవెళ్ళారట. ఆ ప్రాంతంలోని పద్మశాలీయులు గుంటూరు, భట్టిప్రోలు నుండి విద్వాన్ కేతవరపు వరదయ్యశాస్త్రి వంటి వారిని సోలాపూర్‌కు రప్పించుకున్నారట. ఇప్పుడు పద్మశాలీయుల పౌరోహిత్యం సంఘ సభ్యులు పదిహేను వందలకుపైగా వున్నారట. తెలుగు భాషను పరిరక్షించుకోడానికి తెలుగు మాతృభాషాభివృద్ధి సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇక సోలాపూర్‌లోని తెలుగువారు రాజకీయాల్లో కూడా బాగా రాణించారు. రామకృష్ణ బేత్‌గారు శాసన సభ్యునిగా ఎనికై డిప్యూటి స్పీకర్‌గా మహారాష్ట్ర అసెంబ్లీలో తెలుగువారి సత్తా చూపారట. అలాగే గంగాధర్ కుచన్ ధర్మన్న సాదుల్ పార్లమెంటుకు ఎన్నికయ్యారట. ఇక పూణాలోని తెలుగువారి గురించి కూడా ఈ పుస్తకంలో విపులంగా వుంది. 1948లో రజాకార్ల అత్యాచారాల వలన ఎందరో తెలుగు ప్రజలు నిర్వాసితులుగా పూణేకు తరలి వెళ్ళారట. అప్పుడే హైదరాబాదు సహాయ సమితిని స్థాపించారు. చాలా కుటుంబాలు తెలంగాణ నుండి పూణేకు వలస వచ్చాయి. వారిలో కూడా ఎక్కువగా పద్మశాలీయులే వుండటం గమనార్హం. అహమ్మద్ నగర్‌లోను తెలుగువారు ఎక్కువగానే వున్నారు. సగంవేరు, విదర్భ మరాఠ్వాడాలోనూ తెలుగువారు తమ ఉనికిని చాటుకున్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తు న్నారు. అంతర్జాతీయంగా కూడా కీర్తిని ఆర్జించారు. దాదాపు మూడువందల సంవత్సరాల క్రితం మహారాష్ట్రకు వలసవెళ్ళిన తెలుగువారు మహారాష్ట్రను తమదిగా భావించి, తమతోటి తెలుగువారి అభ్యున్నతికై కృషి చేస్తున్నారు. ఇప్పుడు అంతగా మహారాష్ట్రకు తెలుగువారి వలసలు లేవుగానీ, అక్కడ స్థిరపడిన 90% తెలుగువారు అక్కడే వుంటామనడం విశేషం. అయినా ఇప్పటికీ ఇంట్లో వారంతా, తెలుగులోనే మాట్లాడుకుంటారు. వీరంతా మహారాష్ట్ర నివాసాంధ్రులే మరి. అంబల్ల జనార్ధన్‌గారి కలం నుండి రూపుదిద్దుకున్న ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్క తెలుగువాడూ చదవాల్సిన విధంగా వుంది. ఒకవిధంగా తెలుగు వారిచరిత్రే మరి ఈ పుస్తకం.

**ప్రతులకు:** సంచాలకులు,
ప్రచురణల విభాగం,
పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్–500 004.



**డా॥ పులివర్తి కృష్ణమూర్తి**
సెల్:9949092761

## మళ్లీ చిగురించు

శిశిరం శాశ్వతం కాదు
వెన్నంటే ఉంటుంది వసంతం

నిరాశ నిలిచే ఉండదు
నెట్టివేసే ఆశ ఒకటుంటుంది

చీకటి ఎల్లకాలమూ ఎందుకుంటుంది
వెలుతురు పారద్రోలదా?

ఎప్పుడూ ఓటమి యేనా
గెలుపు దారి నీ ముందుంటుంది.

కష్టాలు కలకాలం ఉండవు
సుఖాల జాడలూ ఉంటాయ్

ఎండిన పుడమిని ఎపుడో ఒకప్పుడు
చినుకు చల్లబరుస్తుంది.

కెరటం పడిపోయినా
మరల మరల ఎగిసి పడుతుంది

ఆత్మస్థైర్యమే ఆయుధంగా మలచుకో
నీ జీవన పోరాటంలో విజయం దక్కించుకో.
శిశిరాలను జయించు
మళ్లీ చిగురించు.



**-లలితా వర్మ**
9949672671

## నేను

ఎవరో వ్రాసిన కథను కాదు
ఎవరో చేసిన కుట్రను కాదు.

ఎవరి ముద్ర నామీద లేదు
ఎక్కడ ఎక్కువ సేపు ఉండను.

నీకు నాకు స్నేహం లేదు
నేను నాకే చెందను .

నన్ను ప్రపంచమనే
బజారులో వెతకద్దు
నేను దుకాణం లో
అమ్ముడు పోయే
వస్తువును కాదు.

నేను జీవించే ఉన్నాను
గోడమీద వేలాడే
చిత్రాన్ని కాదు.

నా నుంచి నువ్వు
ఏమి పొందలేవు
నేను చెల్లని నాణెం
లాగ ఉన్నాను .

నాలాగ నిన్ను
ఎలా తయారు
చేయగలను
నేను నువ్వు
వేరు వేరు కదా

భూదేవి నన్ను
స్వంతం
అనుకుంటోంది

కానీ నేను ఆకాశం
నుండి ఊడిపడలేదు

ఎంతో మంది
వస్తున్నారు
పోతున్నారు
జీవితం లో
కానీ నేను
ఎక్కడా
ఆగలేదు
కొనసాగుతూనే
ఉన్నాను



**-అరుణ డేనియల్**
9000606889


## కన్నీర్ర జేసిన కాలం

నిండు నూరేళ్లు
సల్లంగ వుంటవని
ఎన్నో నోములు నోసి
పూజలెన్నో సేసి
నిను గంటి తల్లి
అమ్మ ఋణము తీరుచుకోగా
అమ్మ పేరు నీకు బెట్టి
గారబముగా నిను పెంచుదామని
కొండదేమునికి ముడుపు గట్టితి
నాగుల కోన లో
నాగమ్మకు మొక్కి
నిను సల్లంగ సూడమని
వెంకటేసునికి మొక్కితి
ఏ కన్ను కుట్టినాదో నా తల్లి
నన్ను ఇడిసి పోనావు
మాయదారి రోగమొకటి
అందరికి పాడెకట్టి అనాధబతుకులు
సేస్తూ సిత్రం సూస్తుందిరా నా బిడ్డ....
సుట్టు ఎలుతురున్నా
బతుకేమో సీకటాయే
శివరి సూపు సుడలేని
పాడు కాలం దాపురించే
కరుణ లేని కరోనా
ఇంకెంతమందిని అనాధాలుగా చేస్తుందో...




**-పి.విశాలాక్షి..**
9908435805

పుస్తక సమీక్ష



# సర్వప్ప కవి కలం నుండి జాలువారిన శ్రీ సిద్ధేశ్వర చరిత్రం..!




16వ శతాబ్దానికి చెందిన కాసె సర్వప్ప కవి మూడు ఆశ్వాసాలలో ఓరుగల్లు చరిత్రనంతా ద్విపద రూపంలో రచించాడు. సుమారు 400 సం॥ క్రితం ఈ చారిత్రక కావ్యం సర్వప్ప రాసినట్లు తెలుస్తోంది. తెలంగాణలో వెలువడిన అరుదైన కావ్యంగా భాసిల్లుతున్న "శ్రీ సిద్ధేశ్వర చరిత్రం" సర్వప్ప కృషికి అద్దం పట్టేలా రూపుదిద్దుకుంది. వెండికొండ నుండి హనుమకొండకు తరలివచ్చిన ఈశ్వరునితో మొదలై.. ఈ కావ్యంలో చారిత్రక అంశాలతో.. అనగా.. కాకతీయుల రాజ్యస్థాపన, ఆయా రాజులు.. గణపతిదేవుడు, రుద్రమదేవి. ప్రతాపరుద్రుని పరిపాలనాంతరం దాకా వివరంగా నిక్షిప్తం చేయడం జరిగింది. ఆయా రాజుల కాలం నాటి మతం, ఆలయాలు, పండితులు, కవులు తదితర సామాజిక విశేషాలను ఈ గ్రంథంలో పొందుపరిచారు. అయితే ఈ కావ్యంలో కవి సర్వప్ప తన పద్యరచన ప్రతిభా పాటవాలకంటే.. చరిత్రను ఆవిష్కరించాలన్న ఆకాంక్ష ఉండటం మూలంగా కాబోలు.. ద్విపద ఛందస్సును ఎంపిక చేసుకుని.. ఈ కావ్యాన్ని పూర్తి చేశారని భావించవచ్చు. ఆంధ్ర రచయితల సంఘం.. హైదరాబాదువారు 1960లోనే ప్రథమ ముద్రణకు నోచుకున్న ఈ గ్రంథం.. కాకతీయుల కాలం నాటి చరిత్ర, సంస్కృతి సాహిత్యం గురించి పరిశోధన చేసే వారికి ఉపయుక్తంగా ఉండేందుకు వీలుగా తెలంగాణ సాహిత్య అకాడమీ 2019లో దీన్ని మళ్లీ వెలుగులోకి తేవడం కోసం ద్వితీయ ముద్రణకు పూనుకోవడం ముదావహం.

కవి కాసె సర్వప్ప కలం నుండి జాలువారిన ఈ "శ్రీ సిద్ధేశ్వర చరిత్రము" అను ద్విపద కావ్యంలో.. కాకతీయ మహారాజుల చరిత్రకే పెద్దపీట వేశారు. కాకతీయుల కాలం నాటి పాలకుల పాలనా తీరు తెన్నులను, వారి వీర విహారాలను ఆ కాలం నాటి సాంఘిక పరిస్థితులను, మతాలు– ఆచారాలు.. దేవాలయ నిర్మాణాలు.. వేషభాషలు.. అభిరుచులు.. సంప్రదాయాలు మొదలగు అంశాలను సర్వప్ప కవి చక్కగా ఈ కావ్యంలో పొందు పరిచారు.

ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారి సంపాదకత్వంలో ఈ కావ్యం.. మరింత శోభాయమానంగా తీర్చిదిద్దబడింది. ఈ కావ్యం గురించి ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనంగారు ఆంగ్లంలో రాసిన ఉపోద్ఘాతం నిండుదనాన్ని కూర్చింది.

కాకతీయ రాజుల వైభవ కీర్తిని చాటి చెప్పే ఈ కావ్యంలో.. కవి సర్వప్ప కాకతీయ రాజుల చరిత్రను కూలంకశంగా వివరించారు.

ఇందలి ప్రథమాశ్వాసంలో ప్రతాప చరిత్ర, ద్వితీయాశ్వాసంలో కథామూలాన్ని పొందుపరిచారు. తృతీయాశ్వాసంలో పద్మసేనుడు, వెన్నమరాజు, గుండమ రాజు, కుంతలదేవి, ఎరుక దేవరాజు, భువనైక మల్లుడుల గురించిన సమాచారాన్ని నిక్షిప్తం చేశారు. అంతేగాక తృతీయాశ్వాసంలో.. వేంకటనాథుడు హనుమకొండపై దండు వెడలుట గురించిన వివరాలను అందించారు. త్రిభువ మల్లుడు, ప్రోలరాజులను కూడా ప్రస్తావించారు. స్వర్ణవేది లింగ వృత్తాంతాన్ని, రుద్ర దేవుడు, మహాదేవ రాజు, గణపతిదేవరాజు మరియు తిక్కన సోమయాజి రాకగురించి, సవివరంగా కావ్య రూపంలో అందించారు.

రుద్రమదేవి, దేవగిరి రాజుతో యుద్ధం– ప్రతాపరుద్ర జననం వంటి విశేషాలను ఈ కావ్యంలో చోటు కల్పించారు.

ప్రతాపరుద్రుని పట్టాభిషేకం.. ఆయన రాజ్యపాలనా విశేషాలు ఈ కావ్యంలో లభ్యమవుతాయి.

ఆనాటి దేవాలయాలు.. ఆస్థాన జనం.. ప్రతాపరుద్రుని దినచర్య, రాజ్యవైభవం.. హిరణ్యధేను దానం.. శివ దేవయ్య ప్రభావం.. విద్యావినోదాలు.. మల్లికార్జునభట్ల మరియు కృష్ణమాచార్యుల ప్రభావం వంటి చారిత్రక అంశాలు ఈ కావ్యంలో మనకు దర్శనమిస్తాయి.

పాలకుర్తి సోమనాథుని ప్రభావం.. గొట్టిపరు జమాను మలక.. ఢిల్లీ సుల్తానుతో యుద్ధం.. ప్రతాపరుద్రుని చెఱ...వంటి చారిత్రక ఘట్టాలు ఈ ద్విపదలో పొందుపరిచారు. ప్రతాపరుద్రుడు కాళేశ్వరానికి వచ్చుట.. ప్రతాపరుద్రుని ఢిల్లీ సల్తాను గౌరవించే విశేషాలను మరియు వీరభద్రయ్య పట్టాభిషేక వివరాలను ఈ కావ్యం ద్వారా తెలుసుకోవచ్చు.

కాకతీయ రాజుల వైభవాన్ని చాటిచెప్పే ఈ కావ్యం పరిశోధకులకు ఉపయుక్తంగా మలచబడింది. ప్రతి ఒక్క గ్రంథాలయంలో ఉండదగిన గ్రంథమిది.

**ప్రతులకు:**
తెలంగాణ సాహిత్య అకాడమీ
కళాభారతి,
రవీంద్రభారతి ప్రాంగణం,
హైదరాబాద్– 500 004
ఫోన్: 040–29703142



**- దాస్యం సేనాధిపతి**
సెల్: 94405 25544

## తెలియదు

కలలు కనే...కన్నెపిల్లలకు
తెలియదు పాపం...
తీరందాటి తుఫానేనని...
కాలుజారితే కన్నీరేనని...

కడలిలో ఎగిసిపడే...అలలకు
తెలియదు పాపం..
తీరందాకే తమ పయనమని...
తిరిగి రాక తప్పదని...

చెరువులో తిరిగే...చేపలకు
తెలియదు పాపం...
గట్టెక్కితే తమకు గండమేనని...
ఒడ్డుచేరితే బ్రతుకు ఒక్కక్షణమేనని

రెక్కలుముక్కలు చేసి
మొక్కలు పెంచే...వనమాలికి
తెలియదు పాపం...
పూచిన పూలన్నీ పూజకేనని...
పండిన ఫలాలన్నీ పరులకేనని...

ఆకలిగొన్న
అమాయకపు...మేకకు
తెలియదు పాపం...
తిట్టి కొట్టి తనకు తిండి పెట్టేది...
తిరిగి రేపు తనను తినడానికేనని...

ఒంగిఒంగి...నాయకుడు
దండాలు పెడుతుంటే
పొంగిపొంగిపోయే...ఓటరుకు
తెలియదు పాపం..
రేపు వాడు కుర్చీలో కూర్చోగానే
కుబేరుడౌతాడని...

తాను మాత్రం ఆకలికి
అలమటించే అస్థిపంజరమేనని...

రాత్రింబవళ్ళు
గొడ్డుచాకిరీ చేసే...ఉద్యోగికి
తెలియదు పాపం...
అడ్డదారిలో ప్రమోషన్లు
ఐపోతున్నాయని...
గోడమీది పిల్లులు
మేడమీదికెళ్తున్నాయని...



-పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

## రెక్కలు

ఏది
పుడుతుందో
అది
నశిస్తుంది-
జన్మల
రాజ్యాంగం

కొన్ని
విషయాలు
వేదన
కొరకే-
మనసో
మాలోకం

నవ్వే
గుణం
ఏద్చే
తత్వం-
బొమ్మా
బొరుసు



- డి.రాములు
సెల్:94403 76688

## లక్ష్య సాధన

మనిషి తలుచుకుంటే
ఏదైనా సాధించగలడు,
నీ స్వప్నం ....
నిజం కావాలనుకుంటే
నిరంతర సాధన అవసరం,
సాధించాలనే తపన
లేని కల వ్యర్థం,
ఎవరి జీవితానికి
వారే నిర్ణేతలు ,
ఎవరో వచ్చి ఏదో
చేస్తారనుకోవడం
వెర్రితనం,
నీ జీవితాన్ని ...
నువ్వే చక్కదిద్దుకో,
అపజయాలు .....
విజయాలకు స్ఫూర్తినిస్తాయి
యత్నించి చూడు,
ఎన్ని మెట్లైనా
సునాయాసం గా
ఎక్కిపోవచ్చు,
దీర్ఘకాల లక్ష్యాల్ని
చేరుకోవాలంటే
ముందుగా స్వల్పకాల
లక్ష్యాల్ని సాధించుకొని
ముందుకు వెళ్ళేవారే
విజేతలు,
మనిషి ఎంచుకునే
ఏ లక్ష్య సాధనకూ
ముగింపు ఉండదు,
అది ఓ నిరంతర ప్రక్రియ



-రాయవరపు సరస్వతి
9885656356

## కల్తీ కాటు

కర్షకుని ఎదపై కల్తీ శూలాలు
గుణపంలా గుచ్చుతున్నాయి.
వాళ్ళ చేతులన్నీ ఇపుడు
నకిలీ మాఫియా గాళ్ల
వలలో చిక్కుకొనిపోయాయి.

మోసపోవడం అనే పదం
వారికి కొత్త కాదు.
ప్రపంచానికి పట్టెడన్నం
పెట్టడం కోసం పరితపిస్తుంటే
దళారులంతా దయ్యాల్లా వెంటబడ్డా...
మార్కెట్ మాయలన్ని
మసిపూసి మాయ చేసినా...

ప్రకృతి శక్తులన్ని ప్రతీకారం తీర్చున్నా...
ఎవుసానికి వెన్నెముకవై ..
రాజువై రారాజువై నిబడుతావే తప్ప
గుండె ధైర్యం చెదరనీయవు.

వాళ్ళిప్పుడు ఆకాశంవైపు
చూపులు చూస్తూ...
ఏది మంచో ఏది చెడో కూడా
తెలుసుకోలేని నిస్సహాయులు.
చల్లని గాలులకు ఊయలలూగే
పంటలు పండించే కర్షకుడు...
తొలకరి చినుకులన్నీ పృధివిని
తడుపుతున్నపుడల్లా...
అన్నదాత ఎదలో ఆశలు చిగురిస్తూనే ఉంటాయి..

విత్తుకి..మట్టికి..హాలికుడికి..
విడదీయరాని బంధాన్ని పెనవేసుకొని

మట్టివాసనలు మల్లెమొగ్గల
పరిమళాలుగా వెదజల్లగా
చేతి స్పర్శలతో స్వేదపు చుక్కలు
రాలిపడగా...
ఆశయాలు అనే పంటలు పండిస్తాడు.

కరువుకాటకాలు కరాళనృత్యం ఓవైపు..
కల్తీ విత్తులతో విపత్తు మరోవైపు.
కొత్తకొత్త విత్తులంటూ కుచ్చుటోపీలు
పెడుతుంటే
ఆశయాల పంటలన్ని
మంచు బిందువుల్లా కరిగిపాయే.
ఇప్పుడు... ఎప్పుడు నువ్వే
మా "అన్న"దాతవి.
మా ఆకలి తీర్చే దేవుడివి.



-అశోక్ గోనె
9441317361

## మనిషి పోతున్నడు ఎగిసి!

ఏ అదృశ్య హస్తం నుండి
జారి పడ్డయో కదా!
ఈ అమాయక గోళాలు!

అంతటి శూన్యంలో ఇంతటి గోళాలు
తమను తాము కలువని మట్టి ముద్దలు!
అస్తిత్వాల భ్రమణ పరిభ్రమణాలు!

అనంత శూన్యంలో కాంతి రేఖల వెంట
ఏ ఆత్మ దర్శనానికో?
ఏ తారకల చెంత సేద దీరడానికో?

తిరిగిన దూరాలను లెక్కేసుకుంటూ!

ఈ పరుగుల తిరుగుడులో
ఎన్ని గుండెలు
పురుడు పోసుకుంటున్నయో!
ఎన్నెన్ని గుండెలు ఆగిపోతున్నయో!

ఈ పుట్టుక - గిట్టుకల
దైన్యాలు-హైన్యాలుమాకెందుకో?

అస్తిత్వానికి
తిరుగుడు కొలమానమైతే

ఆగక తిరిగే ఈ గోళాలపై
ఈ గుండెలాగుడెందుకో?

తెలియక తను
లోలోన తిరుగుతున్నడు మనిషి!

హద్దులుమీరిఎగిరిపోతున్నడు ఎగిసి!



-పి.బక్కారెడ్డి
9705315250

## కొడుకా! నేను ఎల్లిపోతున్నా

కొడుకా నేను పోతున్నాను
నిన్నటిదాక ఆకలికేడుస్తు
ఎన్ని రాత్రులు కండ్లల్ల ఆశతో
ఊపిరిపెట్టుకున్నామోగదా!

మనం గట్టిబట్ట కట్టిందిలేదు
బతుకులో ఓ నవ్వు నవ్విందిలేదు
నలుగురు మనతో మాట్లడిందిలేదు
వెలివేసిన తీరైతిమి గదా!

వెంటబడ్డోడు ఎందుకుబడ్డడో
తెల్వక గుండెలు పిండేసిన తీరయింది
వలసబతుకు బతుకాలని
జాలిలేని దేవుడు రాతరాసి పంపిండో!

వయసుడిగిన కాలంలో నాకు
తల్లిలాంటి ఊరికి బాసెటట్టు జేసే
పాపపుణ్యాలు లెక్కగట్టడాదేవుడు
ఊరుకుంటే ఉసురే తాకదాఅనుకుంటి!

ఏ కర్మో ఎవరి పాపమోగాని
ఫలితం మనమే అనుభవిస్తున్నాము
ఈ దరిద్రం అనే పదాన్ని రాసిందెవరో
మనం అందుకోసమే పుట్టినట్టున్నది!


మనం శ్రమను నమ్ముకున్నోళ్ళం
చీకటి వెన్నెల రెండు ఉంటాయటా
ఏదో రోజు మనకు మంచిరోజస్తదని
ఎదురుచూసి అలిసిపోయినోళ్ళము!

ఐదుగురు పాండవులముందు
నూరుగురు కౌరవులోడిన చరిత్రచదివాము
అధర్మం ముందు ధర్మమే గెలుస్తుందని
నిత్యం కండ్లల్లో వత్తులేసుకుని చూసినం!

కొడుకా! ఈ మాయరోగమెక్కడిదో
నాకంటుకుని చంపుతున్నదిప్పుడు
నేను కలలుగన్న నా తనువిప్పుడు
ఇక్కడే కుప్పకూలిపోతున్నదయ్యా!

పేదవాళ్ళంటే దానికి అలుసైందో
కాయకష్టం గూడ చేసుకోకుంటా
కలోగంజో మనం కలిసి తాగకుండా
ఈ మృత్యువు నామిద పగబట్టింది!

స్వార్ధపూరితమైన ఈ మనుషులనుండి
ఉన్నోళ్ళు లేనోళ్ళనే ఈ తారతమ్యాలనుండి
కొడుకా!..నేను ఎళ్ళిపోతున్నాను!
కొడుకా!....నేనీ లోకమిడిసిపోతున్నాను!!



- వజ్జీరు ప్రదీప్
9989562991

## వణుకుతున్న అ'భాగ్య'నగరం

ఓ వైపు వరుణుడి ప్రకోపానికి..
కుమ్మేసిన కుండపోత వర్షం
వణుకుతున్న అ'భాగ్య'నగరం
తడిసి ముద్దైన తెలంగాణం !

మరో వైపున కోకపేటలో..
వేలం పాటకు కురిసిన..
కోట్ల కాసుల కనకవర్షాలు
పొంగిపొర్లిన ఖజానాలు!

నాగోల్ నానిపోయింది
వనస్థలిపురం వణికిపోయింది
సిద్ధిపేట తడిసి తడబడింది
నల్గొండ నీట తేలింది !

రోడ్లన్నీ మహా నదులై..
కాలనీలన్నీ తటాకాలై..
చిన్న చినుకుకే వణికిన..
అభాగ్యుల బతుకులు !

కుంభవృష్టితో విలవిలలు
కూలిన బడుగుల గూళ్లు
తెగిన కట్టలు రహదారులు
మునిగిపోయిన పాడిపంటలు !

నిండుకుండలైన కుంటలు
పొర్లిన చెరువుల అలుగులు
పొంగుపొర్లుతున్న వాగులు వంకలు
జోరుగా దునుకుతున్న చెక్‌డ్యామ్‌లు !

పడవల్లా తేలుతున్న మంచాలు
కొట్టుకుపోతున్న ఇంటిసామాన్లు
ఊడ్చుకుపోయిన అభాగ్యుల ఆశలు
మిగిలిన నిరాశల బురద మడుగులు !

కన్నీటి జలధారలు కలిసి..
పెరిగిన వరద ఉధృతులు
అల్పజీవుల్ని అనాథల్ని చేసిన..
అల్పపీడనాల ఆవేశవానలు !

చేతులెత్తేసి రెడ్ అలర్ట్ జారీలు
జరభద్రమని ప్రభువుల పలుకులు
మేమున్నామంటూ అనంత హామీలు
దిక్కుతోచక దీనుల చూపులు !



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## మా కిష్టం

వీచె గాలి
పూసె పువ్వు
మాకిష్టం..మాకిష్టం.

ముసిరే వాన
మురిసే పైరు
మాకిష్టం..మాకిష్టం.

మెరిసే మెరుపు
ఉరిమే ఉరుము
మాకిష్టం..మాకిష్టం

కురిసే మంచు
విరిసే వెన్నెల
మాకిష్టం..మాకిష్టం.

లేచే కెరటం
ఉరికే ఉప్పెన
మాకిష్టం..మాకిష్టం.

వెలిగే తార
కడిగిన ముత్యం

మాకిష్టం..మాకిష్టం
పారే ఏరు
పెరిగిన ఊరు
మాకిష్టం..మాకిష్టం.

మొక్కిన గుడి
చదివిన బడి
మాకిష్టం..మాకిష్టం



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

## కలుపు తీయాలి....

ఇంటి ముందున్న ఏకొంచెం జాగనైనా
చదునుచేసి కొన్ని పూలమొక్కలు నాటి
పెంచి పోషించే ప్రయత్నం చేసిచూడు....

నాటిన ఆ మొక్కలతో పోటీపడి
పెట్టని పిచ్చిమొక్కలు పుట్టుకొచ్చి
మొలకలెదిగే క్రమంలో అడ్డుపడుతూ
చిందర వందర చిరాకు పుట్టిస్తాయి..

వాటి మొదళ్ళలో కలుపు తీసి పాదులుచేస్తే
ఆ మొక్కలు ఏపుగా ఎదిగి ఉల్లాసంగా
తలలూపుతూ ఒయ్యారాలు పోతాయి
మనసును దోచే రంగు రంగుల పూలను
బహుమతిగా ఇచ్చి ప్రాణం పంచుతాయి...

పెరిగే మొక్క తాను ఎదిగే ఒక్కొక్క దశలో
పుట్టుకొచ్చిన సవాళ్ళను ఎప్పటికప్పుడు
పద్ధతిగా మట్టుపెడుతూ చేయాలి చిరుసేద్యం...
అలాగే మది గదిలో గతితప్పి గందరగోళం
పుట్టిస్తున్న ఆలోచనల తేనెతుట్టెను ఒడిసిపట్టి
చేయాలి కూసింత కసరత్తు మదికదే నైవేద్యం....


ఏదీ దానంతటదే నీకు దాసోహం అయిపోదు
అదే ప్రకృతి నుండి నేర్చుకోవాల్సిన పాఠం

మనం చేసే పనిలో సత్ఫలితం పొందాలన్నా...
మన చింతనలో చిక్కులు తొలగిపోవాలన్నా...
పూలతోటలో అన్యజాతి పుట్టుకనుకట్టడి చేసినట్టే
మనోవనంలో చెత్తమొక్కల్లాంటి మకిలి యోచనల్ని
మునుంపెట్టి ఎప్పటికప్పుడు కలుపుతీయాలె...

హంస పాలు తాగినట్టు,నిండు కుండ తొనకనట్టు
మదిలో మెదిలే భావాలను ఒడిసిపట్టుకోవాలి
ఆలోచనల వరదవెల్లువకు ఆనకట్టకట్టి, అవసరం
మేరకే పారకం పెట్టాలి మంచికోసమే మల్లించాలి
గ్రహణం వీడిన సూర్యుడిలా ఆలోచనలపర్వం
స్వచ్ఛమై శుద్ధమై తేజోవంతంగా వెలిగిపోవాలి....

నిర్మల హృదయమే మనిషికి హూందాతనాన్నద్దేది
ఎప్పుడైనఎక్కడైన నిటారుగా నికార్సుగా ఉందాం
వంగిపోవడం తలదాచుకోవడం, కలతబురదలో
మునకలేయడం ఊపిరాడక గిలగిలా కొట్టుకోవడం
ముమ్మాటికీ అనవసరపు రాద్ధాంతమే కదా నేస్తం..!

ప్రకృతి కాంత తను కొత్త రాగం అందుకోవాలన్నా
ఆలోచనల వికాసం గెలుపు జండా ఎత్తుకోవాలన్నా
అటు పూల వనానికి ఇటు మనసులో మాయలకు
ఎప్పటికప్పుడు తప్పక చెయ్యాలి కలుపు నివారణ..



-మంచికట్ల లక్ష్మణ్
9494800112

## నా కవిత సమాజ చైతన్య గీతిక

సమాజ లోపాలనుసరిచేసి సమాజాన్ని చైతన్యపరిచే చైతన్యగీతికై
మూఢనమ్మకాలను ఆమడదూరం చేసే మంత్రదండమై సమసమాజ స్థాపనకై
నినదించే ప్రజా గొంతుక నాకవిత.

అవినీతి అక్రమాలను అంతుచూసే అక్షరాస్త్రమై నీతి నిజాయితీకి పట్టంకట్టే
వజ్రసింహాసనమై అభ్యుదయభావాలను అవనికి అందించే విప్లవ జ్యోతి నా కవిత

ఆత్మీయత అనురాగాలను ధాత్రికి ధారపోసే మరో జననిగా బరువు బాధ్యతలను
గుర్తుచేసి బ్రతుక్కి బంగారు దారి చూపే
కన్నతండ్రిగా సుదూరమవుతున్న బంధాలను కలిపే ఆత్మబంధువు నాకవిత.


తెలియని విషయాలను అణ్వేషించి తెలిపే నిత్యాణ్వేషిగా గమనం తెలిక
అంధకారం అలిమినప్పుడు లక్ష్యానికి దారి చూపే మార్గదర్శిగా లోకానికి
విజ్ఞానాన్ని అందించే బహుముఖ విజ్ఞాన బాండాగారం నాకవిత

మనఃకుహరంలో దాగిఉన్న ప్రతిభను వెలికితీసే ఉపాధ్యాయినిగా కులమత
అంతరాలు లేని కలలప్రపంచ నిర్మాతగాదేశ భక్తిని ప్రజ్వలించి
జాతిని ఐక్యం చేసే మరో జాతిపిత నా కవిత

సమాజ జాగృతమే నా కవనమై జన సంఘటితమే నా ధ్యేయమై
సిరా ఇంకుతో సమాజ కొవ్వు కరిగేదాక
నా కలము చేసే కవన ప్రయాణం
జనుల్లో తెచ్చేను నవ జీవనయానం.



- డి.అమీర్
9642480702





## తెలంగాణ సాహితీ తేజఃపుంజం ఎమ్.వి.నరసింహారెడ్డి 'జీవన దర్పణం'

సుసమీక్షావధాని శీలం జగతీధర్ సంకలనకర్తగా ఏర్చి కూర్చిన 'తెలంగాణ సాహితీ తేజఃపుంజము యం.వి. నరసింహారెడ్డి 'సమగ్ర సాహితీ జీవిత అవలోకనం, ఒక గ్రంథంగా కాకుండా, ప్రతిభా దర్పణంగా దర్శింపజేస్తోంది. గ్రంథ శీర్షిక సాహితీ తేజస్విగా యం.వి. నరసింహారెడ్డిగారి ఉత్తమ సాహితీ విలువలను స్ఫురింపచేస్తోంది. సుసమీక్షావధానిగా రచయితగా, అనువాదకునిగా, సంఘసేవకునిగా, సంపాదకునిగా గుర్తింపు సాధించిన శీలం జగతీధర్‌గారి రచనలు స్ఫూర్తి ప్రదాత, శ్రీ ఆంజనేయ స్వామి చరిత రెండింటి సారాంశం గ్రంథ సమీక్షలు, పీఠిక, తొలిపలుకు, అభినందనలు, ఒక మాటగా ఈ గ్రంథంలో చోటు చేసుకోవడం విశేషాంశం. యం.వి.నరసింహారెడ్డి రచించిన ఆధ్యాత్మిక, స్వీయ, అనువాద గ్రంథాలను, వారి పరిచయాన్ని 29 అధ్యాయాలలో వివరించారు.

వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, శ్రీరామాయణ భాగవత, అష్టాదశ మహా పురాణాలలో నిక్షిప్తమైన సనాతన జ్ఞానసంపదను సామాన్య వ్యవహారికంగా చదువరులకు అందించటం అందరికీ సాధ్యమైన సాహితీకృషి కాదు. ఉపాధ్యాయునిగా, జర్నలిస్టు, ఎడిటర్, విద్యాసంబంధిత రచయితగా, తెలుగు, ఆంగ్లం, హిందీ భాషలలో జోక్స్ రచనలు కూడా వెలువరించిన యం.వి. నరసింహారెడ్డి ప్రతిభ బహుముఖంగా కాంతి ప్రసరింపచేసింది. అందుకే శీలం జగతీధర్ సంకలనకర్తగా, ఈ గ్రంథానికి తెలంగాణ సాహితీ తేజఃపుంజము అని పేరు పెట్టారు. దాదాపుగా 28 ఆధ్యాత్మిక, స్వీయ, అనువాద గ్రంథాల రచయితగానే కాకుండా పివి, బోయినపల్లి, దివాకర్ల, కాసుగంటి, సినారె, సంగనభట్ల, నందిని

ఎందరో వివిధ రంగాల ప్రముఖులతో ఎమ్.వి. నరసింహారెడ్డిగార్కి సన్నిహిత బాంధవ్యం నెలకొనివుంది. కౌసల్య తెలుగు పండిత శిక్షణా కళాశాల ద్వారా మాతృభాషలో నైపుణ్యాన్ని పెంపొందింపచేసే సత్కృషి వంటి కార్యాచరణ సాధించారు. ఎన్నో సత్కారాలు, సన్మానాలు, అభినందనలు, అవార్డులు, ప్రశంశాయుతమైన సమీక్షలు, అలుపు సొలుపు లేని జీవన ప్రస్థానాన్ని ఈ గ్రంథం ప్రదర్శింపచేస్తోంది. సాహితీలోకానికి, విద్యా విద్యార్థి చైతన్యానికి, సమాజ సేవా సత్సంకల్పానికి అంకితమైన, ఎమ్.వి. నరసింహారెడ్డిగారిని గుర్తించి తగిన స్థాయి కల్పించవలసిన బాధ్యత ఇటు ప్రజలకు అటు తెలంగాణ ప్రభుత్వానికి ఉన్నదని సుసమీక్షావధాని, కూర్పు- సంకలనకర్త శీలం జగతీధర్ భావించటం ఎంతైనా సముచితం.

ప్రతులకు:శీలం జగతీధర్
ఇ.నెం.2-1-61/1, శ్రీరామ్‌నగర్
జగిత్యాల-505 327
సెల్: 9849284349



-జయసూర్య
సెల్: 9440664610

పుస్తక సమీక్షలు

## చెట్లు లోకానికి మెట్లు

అవనికి చెట్ల:దం
తోటకు పూలందనీ
మాటలు మకరందం
జీవిత పరమానందం..

ఇంటిముందు మొక్కలు
అందమిచ్చే మొక్కలు
అందరు నచ్చే మొక్కలు
హాయినిచ్చే మొక్కలు..

తరువు లేని లోకమందు
వానరాక దుఃఖమందు
భవిత అంధకారమందు
మొక్కలు నాటు ముందు

మా తోటలో బంతులు
మనసు దోచే మల్లెలు
పచ్చని చేమంతులు
అలుముకున్న కాంతులు

కొమ్మ ఒకటి నాటింది
ప్రేమతోడ పెంచింది
తన మదిని దోచింది
హృదయంలో నిలిచింది

ధరణి అంతా పచ్చగా
చీరకట్టు సొంపుగా
కనికట్టు చేయగా
కనువిందు చేసెనుగా

బడిలోనా మొక్కలు
పిల్లలు నాటే మొక్కలు
ముచ్చటైన మొక్కలు
ముద్దుగులోపే మొక్కలు

దారిగుంట మొక్కలంట
అందరూ నాటిరంట
నీడనిచ్చి చూపెనంట
హాయినిచ్చి పంపెనంట

చెట్లేమో నాటినంతట
ఫలములే ఇచ్చునంట
ఆకలేమి తీరునంట
ఆనందం మిగిలెనంట

మొక్క ఒకటి పెట్టేను
ఆక్సిజను ఇచ్చేను
ఆరోగ్యము పెంచేను
ఆయువునే నిలిపేను

అవని చెట్లు నరకొద్దు
అంధకారం చేయొద్దు
భవిత పాడు చేయొద్దు
చెట్లతోడు మనకు కద్దు.

పచ్చదనం రక్షణ
హరితహారం శిక్షణ
చేయరాదు భక్షణ
మనకు అది రక్షణ

ప్రకృతి వ్యవసాయం
మేలు చేసెఫలసాయం
ఇచ్చును ఆదాయం
ఆయెను జీవితాశయం.

విషగాలిని తొలగించు
ఆరోగ్యాన్ని కలిగించు
ఆహారాన్ని అందించు
ఆనందాన్ని పంచు

కాలుష్యం పోగొట్టు
ఆరోగ్యాన్ని కనిపెట్టు
ఆయువునే పంచెట్టు
మొక్క నాటే పనిపట్టు.

తరువులు పెంచుమురా
కరువును తీర్చునురా
బరువని తలచకురా
మనకు మేలు చేయునురా

భూదేవి కళ్యాణం
ప్రకృతిలో కళ్యాణం
తరువులతో నిర్మాణం
అది మానవ కళ్యాణం

పచ్చదనం భూమిలో
ప్రాణవాయువు అవనిలో
ఆరోగ్యం మేనులో
సంతోషం మోములో

పయనించే మేఘాలు
చూడచక్కని అందాలు
పచ్చని పంటచేలు
కురిసాయిగా వానలు

ఓషధాల మొక్కలు
ఆరోగ్యానికి మలుపులు
కషాయం తాగు మేలు
కాఫీ టీ లకు బదులు



-చైతన్య భారతి పోతుల
7013264464

## బాటసారి

పల్లెప్రేమ నొదిలి అన్నో
పట్నానికొచ్చినా నన్నో
బతుకు తెరువు కొచ్చినానన్నా
ఇంతలో కరోనా కాటేశనన్నో
పల్లెబస్సు లేదు అన్నా
మల్లి చూపులేదన్నా

పల్లె ప్రేమ నొదిలి అన్నో
పట్నానికొచ్చినా నన్నో

బతుకు తెరువు కొచ్చినానన్నా
తల్లి తండ్రి పల్లెలో నన్నా
తల్లడిల్లిపోతు నేనీడనే అన్నా
అష్టకష్టాలతో ఈడనేనన్నా
పల్లెప్రేమనొదిలి అన్నో
పట్నానికొఎచ్చినా నన్నో.



- సత్యం
సెల్: 9100495714

## బాటసారి పదాలు

"మురిపెం కదా పుట్టిన రోజు
లోకం తలుపు తట్టిన రోజు
యాత్రను మొదలు పెట్టిన రోజు"

యాత్రను మొదలు పెట్టామంటే మనమంతా బాటసారులమే కదా! మన కోసమే ఈ బాటసారి పదాలు. దర్భశయనం శ్రీనివాసాచార్య ఇవి బాలలకోసం రాసినా, ఇందులో పెద్దలకూ పలు సుద్దులున్నాయి. పుట్టినరోజు అందరికీ వేడుక. పుట్టింది ఎందుకో ఎందరి కెరుక ? పై పంక్తులను పఠిస్తుంటే ఈ లోకంలో మన పాత్ర ఏమిటి ? జీవనయాత్రలో మనం ఎంతవరకు సఫలమయ్యాం ? అని ఏ రోజు కారోజు బేరీజు వేసుకోవాలని పిస్తుంది.

"ఆడకా పాడకా / ఎగురకా తిరుగకా / అదేమి బాల్యం ఇక."

అర్ధశతాబ్దం క్రితం వరకూ - పిల్లలు ఆడుతూ పాడుతూ ఎగురుతూ దుంకుతూ బాల్యాన్ని సంపూర్ణంగా అనుభవించేవాళ్ళు. శారీరక మానసిక వికాసాన్ని పొందే వాళ్లు. మధురమైన బాల్యాన్ని మించిన సంపద లేదు. ఇప్పుడు బాల్యం బందీ అవుతున్నది. ఆటపాటలు నేర్పని బడులు పిల్లల కవి ఎడారులు.

"అదీ ఇదీ లేదని విలవిలా
అనుదినమూ విలపిస్తే ఎలా
ఉన్న వెలుగులు పోవు వెలవెలా"

ఈనాడు మనుషుల్లో ఉన్న ఆవేదనకు కారణం - ఉన్నదానిపై నిర్లక్ష్యం, లేని దానిపై ఆరాటం. అందని దానికి అర్రులు చాస్తున్నారు. ఉన్నదాన్ని చేజార్చుకుంటున్నారు. ఒత్తిడికి గురౌతున్నారు. ప్రశాంతతకు దూరమౌతున్నారు.


రేపు ఘనంగా బ్రతకాలని ఈ రోజును బలిపెట్టొద్దు. నిన్నటి రోజును మరువొద్దు. గతాన్ని స్మరించాలి. వర్తమానం ఆస్వాదించాలి. భవిష్యత్తు ఉజ్జ్వలంగా ఉండాలి.

"తరలిన తరాన్ని స్మరించు
ఇప్పటి తరంలో చరించు
రేపటి తరాన్ని దీవించు"

పూర్వీకుల అనుభవాలు పునాదిగా - మనం చేసే మంచి పనులు భావితరాల వారికి ఉపయోగపడాలి అని కవి భావన.

"బతుకే ఓ గొప్పవరం / చావొద్దు






కోరి ఎవరం / చేద్దాం బతికి సమరం"

సెల్‌ఫోన్ కొనివ్వలేదనో, పరీక్షల్లో పాస్ కాలేదనో, పెద్దలు మందలించారనో, ప్రేమ విఫలమైందనో, అనుకున్నది సాధించలేదనో ఆత్మహత్యలకు పాల్పడేవాళ్ళు, ఆ క్షణం వివేకంతో ఆలోచిస్తే, బ్రతుకే వరం అనుకుంటే కష్టం పారిపోతుంది. ఉజ్జ్వల భవిష్యత్తు సొంతమౌతుంది.

కంప్యూటర్‌ను కాదంటామా ? సాంకేతికతను వద్దంటామా ? కాని 'ధాన్యముంటేనే జీవనం'. ధాన్యాన్ని పండించేవాడు, మన కందించేవాడు రైతు. ఆ రైతు వలన మన బ్రతుకే పండుగ. ఆ రైతే వెతల పాలై చితికిపోతే మన బ్రతుకే దండుగ.

ఆడంబరాలు, అట్టహాసాలు, బడాయి మాటలు, పైపై పూతలు వద్దు. ఎవరి మెప్పుకోసమో వేషాలు మార్చవద్దు. నచ్చితే నచ్చిందని, నచ్చకపోతే నచ్చలేదని చెప్పాలి కాని అబద్దాల బతుకు బతకొద్దు. సహజంగా పలకాలి. సరళంగా బతకాలి. అప్పుడే బతుకులోని సౌందర్యం తెలుస్తుంది. మాట్లాడాల్సిన చోట మౌనంగా ఉండకూడదు. మౌనంగా ఉండాల్సిన చోట మాట్లాడకూడదు. మాటల్లో సారముండాలి. పాటలో జీవముండాలి. 'మాయ అంటని మాట పరిమళపు పూదోట'. హుషారైన పాట ఉల్లాసానికి ఊట.

ఇతరులకు మనం ఏది ఇచ్చినా ఇష్టంగా, ప్రేమగా ఇవ్వాలి. ఆపద ఉన్న వారిని ఆదుకోవాలి. చెలిమి కొరకు ఎదనే తెరవాలి. ఎవరో వేసిన దారిలో మనం నడుస్తున్నాం. వారికి ఋణపడి ఉండాలి. మనం కొత్త దారీ వేయవచ్చు. అది సకల జనుల మేలు కోరేదై ఉండాలి. మనం జ్ఞానం నేర్చింది బతుకు తెలుసుకొనేటందుకే, సేవలు చేసేటందుకే - ఇలా అందరికీ పనికొచ్చే అంశాలు ఎన్నో ఉన్నాయిందులో-కవితల రూపంలో.

ఈ పుస్తకంలో మన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే సూక్తులు మాత్రమే కాదు.

"చంద్రుడు రాతిరి వస్తాడు - చలువ చందనం పూస్తాడు."

"సూర్యుడు రోజూ పిలుస్తాడు - వెల్తురు పుష్పాల్ని ఇస్తాడు."

"రాలిపడుతున్న పూలు / అవి తరువు సంతకాలు / నేలకు అభిషేకాలు."

వంటి కవిత్వ పరిమళాన్ని విరజిమ్మే పంక్తులూ ఉన్నాయి.

"ఆకాశం దాకా సాగి
ఆ చుక్కల దగ్గర ఆగి
తిరిగి రా ఆ కాంతి తాగి"

ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిసున్నాయిపదాలు, దృష్టి విస్తృతం చేసుకో, హృదయం విశాలం చేసుకో అని కవి ఉద్దేశం.

"చిరునవ్వే ఒక పువ్వు
అడుగక మునుపే ఇవ్వు
విరబూయు మరో నవ్వు"

నవ్వు మనిషికి వరం. అంతరంగాలను వెలిగించే భాస్వరం. మనం నవ్వితే ఎదుటివాళ్ళూ నవ్వుతారు. అందరూ హాయిగా నవ్వగలిగితే లోకమే ఆనందనందనం.

దర్భశయనం దృష్టిలో - ఇంటిలో ఎన్ని ఉన్నా పుస్తకం లేకపోతే విలువ సున్న. అందుకే "కొత్త పుస్తక మందుకో / కొత్త ఊహల నల్లుకో / బతుకు కొత్తగ మలచుకో" అంటాడు.

ఈ బాటసారి పదాలకు అంత్య ప్రాస అందమిచ్చింది. కవిత్వం సుగంధమిచ్చింది. ఈ బాటసారి పదాలు చదివితే కొంతసేపైనా ప్రశాంతంగా ఆలోచించగలుగుతాం. జీవితంలో కొంతైనా ఆచరించగలుగుతాం. 'స్పందన' అనంతకవుల వేదిక స్పందించి ఈ పుస్తకాన్ని ప్రచురించింది. ఈ పుస్తకానికి వేసిన ముఖ చిత్రమైనా, ప్రతి పేజీకి వేసిన బొమ్మలైనా భావానుగుణ ంగా, చూడ ముచ్చటగా ఉండడం విశేషం. ఈ పుస్తకాన్ని కవి తన మనుమరాలు వరేణ్యకు అంకితమివ్వడం మరో విశేషం.

"ప్రతిరోజూ ఓ కానుక / బ్రతుకంతా ఓ వేడుక / కావాలని మన కోరిక"

కవి కోరినట్లుగా అందరి బ్రతుకు వేడుక కావాలని ఆశిస్తున్నాను. దర్భశయనం శ్రీనివాసాచార్య బాలల కోసం ఇంతకు మించిన మరో కావ్యం రాయాలని అభిలషిస్తున్నాను.

ప్రతులకు :
దర్భశయనం శ్రీనివాసాచార్య
వెల : రూ॥ 60/-
జసెల్ : 9440419039



-ఎ. గజేందర్‌రెడ్డి
సెల్:9848894086

## మా నాన్న పాఠశాల

ధనం ముఖ్యం కాదు
ధర్మాన్ని పాటించి
ధర్మాన్ని ఆచరించు
నీతి నిజాయితీగా బ్రతుకు
ఆదైవం ఇస్తుంది నీకు మెతుకు
మా నాన్న
నీతి బోధలు చేసినాడు
నిజాయితీగా బ్రతికినాడు
అందుకే కదా మా నాన్న
మేడలు మిద్దెలు కట్టలేదు
ఆస్తులను కూడా పెట్టలేదు
కష్టాలు ఎన్నో భరించాడు
ఏ లోటు లేకుండా
మమ్ము పెంచాడు
ఎనిమిది మంది సంతానం
ఆర్గరు మగ, ఇద్దరు ఆడ
మా నాన్న సంపాదించిన ధనం
మేము తీర్చుకోలేని ఋణం.
ఎవరి స్వశక్తితో
వారు సంపాదించుకుంటే
జీవితం విలువ తెలుస్తుందని
కష్టసుఖాలు తెలుస్తాయని
మా నాన్న నేర్పిన పాఠం.
చివరి రోజుల్లో మా నాన్న
తన తలగడ కింద దాచుకున్న
తెల్ల కాగితపు ముక్కలను
ధనంగా భావించాడో ఏమో
తన రుణం తీరిపోద్ది అని
మా అందరినీ పిలిచి
సమానంగా పంచుకోమన్నాడు
అమాయకపు మా నాన్న
మనసుకు మా కన్నీటి తర్పణం
మనం ఈ సమాజములో
నిత్యం చూస్తూనే ఉన్నాం !
తల్లిదండ్రుల ఆస్తుల( కొరకు) పంపకంలో
ద్వేషాలు పెంచుకుంటున్నారు
అనుబంధాలు తెంచు కుంటున్నారు
తోడబుట్టిన వారినే దూరం చేసుకుంటున్నారు
అనురాగాలకు దూరమవుతూ
ఆస్తులను పంచుకుంటున్నారు
ఎదురు తిరిగితే హత్యలు
కూడా చేయిస్తున్నారు
ఈ దుస్థితి మాకు రానివ్వలేదు
మా నాన్న ఆస్తులను సంపాదించి
మాకు ఆ అవకాశం ఇవ్వలేదు
మా నాన్న గొప్ప ఘనుడు
మా నాన్నే మాకు
ఆస్తి, సిరి,సంపద. దైవం
మా నాన్న మాకు
ఒక గొప్ప పాఠం నేర్పాడు
స్వశక్తి యే భుక్తి అనే సూత్రం.
జోహార్ నాన్న! నీకు జోహార్ !!
( పితృ దినోత్సవ సందర్భంగా )




-కావ్యసుధ "(ఆర్. హరి శంకర్ )
9247313488.

## ఆకాశ వీధిలో..

ఆకాశం అక్వేరియంలో
ఈదుతున్న అందమైన తల్లి చేప
మిణుకు మిణుకు మనదు.
కళ్ళల్లో ఆకాశ పుస్తకం
తెరిస్తే పుటలు రెండే
ఒకటి రాత్రి, మరొకటి పగలు
చదివిందే చదువుకోవచ్చు
తీరిగ్గా, వరుసగా.
తన సిగ్గుల దొంతరకు
మబ్బుల తెరలు సరిపోవు.
ఆకాశమంత అవకాశాల నీడల్లో
అటూ ఇటూ నేలపై
వెదుకులాటలో మనం.
తన చేతులతో చినుకుల దీవెనల్ని
ఇల మీదకు చల్లగా పంపిస్తుంది

అవి మొలకెత్తి
పచ్చగా చిగురించడమే తరువాయి.
నింగి నేలతో సోపతి లేకుండా
తెల్లారదు, పొద్దు గడువదు
దిక్కు తోచదు చీకటి వెలుగులకు.
ఆశల ఆకాశం మబ్బులు కమ్మెసె
ఉరుముల దరువులతో
భూమంతా దద్దరిల్లె.
రాత్రి ఆకాశంనక్షత్రాల కేరింతలు
నాలో చీకటి కాదు.
తారకల తళుకు బెళుకులు
పగలు పక్షి సమూహాలు
ఆకాశం తీరిక లేనిది
నడుమ మేఘాల ఊగిసలాటలుప
సూర్య చంద్రుల ప్రణాళికా రచన
ఆకాశ వీధిలో బాగానే సాగింది



- వనిపాకల లచ్చిరెడ్డి
9966897001

